thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 92 | జగిత్యాల | మంగళవారం | 30 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

### హైదరాబాద్ హీరోస్ కు రగ్బీ కిరీటం



11

### అయోధ్య నిధుల దుర్వినియోగం



- అత్యవసర విచారణకు సుప్రీం తిరస్కరణ
- అంత తొందరెందుకని పిటిషన్‌కు ధర్మాసనం ప్రశ్న

4

### 65 ఏండ్ల వృద్ధుడికి ఉరి శిక్ష



- మూడేళ్ల బాలికపై లైంగికదాడి కేసులో మరణ దండన
- పూణె ఫాస్ట్ ట్రాక్ కోర్టు సంచలన తీర్పు

2

### జీవితం పరుగు కాదు..

- నిలకడ, క్రమశిక్షణతో లక్ష్యాలు సాధించా లని విద్యార్థులకు నితిన్ నబీన్ సూచన
- తెలంగాణలో బీజేపీ అధికారానికి ఎంతో దూరం లేదన్న జాతీయ అధ్యక్షుడు



4

# భూ సేకరణలో ప్రజలకు అన్యాయం జరగొద్దు

**మూసీకి కొత్త జీవం!**

**ప్రాజెక్టు పునరుజ్జీవంతో నగరం రూపురేఖలు మార్పు**

- ఇళ్లు కోల్పోయే వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు
- అభివృద్ధి, మానవీయ కోణాలతో భూ సేకరణ
- పర్యావరణ పరిరక్షణ, వరద నియంత్రణపై దృష్టి

**రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుతో తెలంగాణ భవిష్యత్తు, హైదరాబాద్ నగర రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మూసీకి కొత్త జీవం పోస్తూ, పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రాజెక్టును తీర్చిదిద్దుతామని చెప్పారు. మూసీ ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ, పునరావాసం తదితర అంశాలపై మంత్రి పొంగులేటి సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా మార్చే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతతో మూసీ పునరుజ్జీవానికి శ్రీకారం చుట్టారని మంత్రి ఈ సందర్భంగా కొనియాడారు.

వివరాలు 2వ పేజీలో..




# పర్యాటకానికి కొత్త రెక్కలు!

- ఫ్రాన్స్, కొరియాలతో రాష్ట్ర ప్రభుత్వ చర్చలు
- మంత్రి జూపల్లితో విదేశీ ప్రతినిధుల భేటీ
- పర్యాటకం, పెట్టుబడులపై సమాలోచనలు
- అక్టోబర్ 25 న నగరంలో కొరియన్ సాంస్కృతికోత్సవం
- ఉమ్మడి సహకారానికి రెండు దేశాల సై

...వివరాలు 3లో

## పోలీసు శాఖలో భారీ మార్పులు

- పలువురు ఐపీఎస్ అధికారుల బదిలీలు
- రామగుండం, వరంగల్ కమిషనర్లకు కొత్త బాధ్యతలు
- హైదరాబాద్, సైబరాబాద్‌లోనూ కీలక పోస్టింగ్‌లు




3

## కొడంగల్ లో 33 వేల దొంగ ఓట్లు!

- ఆ ఓట్లతోనే 2023 లో రేవంత్ రెడ్డి గెలుపు
- 11,000 మందికి కర్ణాటకలోనూ ఓటు హక్కు
- సంచలన ఆరోపణలు చేసిన టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



3

## రైతులకు కాంగ్రెస్ ద్రోహం!

- హామీల అమలులో సర్కారు విఫలం
- అన్నదాతలకు వేముల ప్రశాంత్ రెడ్డి ఏరువాక శుభాకాంక్షలు





## కేంద్రం కరుణిస్తేనే.. పల్లె ప్రగతి!

ఢిల్లీ సదస్సులో సీతక్క గళం 60:40 విధానంపై అసంతృప్తి

3

## ఓటరు జాబితా పక్కాగా!

- సజావుగా ఎస్ఎస్ఆర్ ప్రక్రియ
- బీఎల్ఓల తీరు భేష్
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఎస్ఆర్-2026) ప్రక్రియ సజావుగా సాగాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. కేవలం 4 రోజుల్లోనే 1.73 కోట్ల ఫారాలను పంపిణీ చేసిన బీఎల్ఓల పనితీరును ఆయన అభినందించారు. విధుల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సోమవారం బీఆర్ కే భవన్ నుంచి సీఈవో సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

2

## ఖమ్మంలో భారీ వర్షాలతో సీఎం సభ రద్దు

- ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలతో మారిన వేదిక
- హైదరాబాద్ నుంచి రైతుభరోసా నిధుల విడుదల
- నేడు శిల్పకళా వేదికగా సదస్సు నిర్వహణ
- వర్చువల్ విధానంలో పాల్గొననున్న రాష్ట్రవ్యాప్త రైతులు

3





# పర్యాటకానికి కొత్త రెక్కలు!

**ఫ్రాన్స్, కొరియాలతో రాష్ట్ర ప్రభుత్వ చర్చలు**

**మంత్రి జూపల్లితో విదేశీ ప్రతినిధుల భేటీ**

**అక్టోబర్ 25 న నగరంలో కొరియన్ సాంస్కృతికోత్సవం**

**హైదరాబాద్, జూన్ 29 :** తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సచివాలయంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం ఫ్రాన్స్, దక్షిణ కొరియా దేశాల ప్రతినిధులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. పర్యాటకం, పెట్టుబడులు, వారసత్వ సంపద పరిరక్షణలో పరస్పర సహకారంపై వారితో ఆయన లోతుగా చర్చించారు. సచివాలయంలో ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ హామీ, డిప్యూటీ కాన్సుల్ పాస్కల్ లోరియో తదితరులు మంత్రి జూపల్లితో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. తెలంగాణలో ఉన్న చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని మంత్రి వారికి వివరించారు. ఫ్రెంచ్ పర్యాటకులను ఆకర్షించేందుకు సంయుక్త కార్యాచరణ ఉండాలని ప్రతిపాదించారు. ఏటా 10 కోట్ల మందికి పైగా పర్యాటకులతో ఫ్రాన్స్ అగ్రస్థానంలో ఉందని, పర్యాటకం ద్వారా తెలంగాణలోనూ విదేశీ పెట్టుబడులు పెరిగేలా కలిసి పనిచేస్తామని మార్క్ హామీ పేర్కొన్నారు. తెలంగాణలో సుమారు 200 మంది ఫ్రెంచ్ పౌరులు నివసిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. ఇండియాలోని కొరియన్ కల్చరల్ సెంటర్ డైరెక్టర్ వాంగ్ ఇల్యాంగ్ నేతృత్వంలోని బృందం కూడా మంత్రి జూపల్లితో భేటీ అయింది. అక్టోబర్ 25 న హైదరాబాద్‌లో తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. మన దేశంలో, ముఖ్యంగా యువతలో ఓటీటీ వేదికల ద్వారా కొరియన్ కే-డ్రామాలకు వస్తున్న ఆదరణను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. సంగీతం, నృత్యం, వంటకాలతో రెండు ప్రాంతాల సంస్కృతులను ఒకే వేదికపైకి తేవడం ద్వారా ప్రజల మధ్య సత్సంబంధాలు పెరుగుతాయని మంత్రి జూపల్లి ఆశాభావం వ్యక్తం చేశారు. సృజనాత్మక భాగస్వామ్యాలకు ఇది ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ భేటీలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల కొరియా కాన్సుల్ జనరల్ సురేశ్ చుక్కపల్లితో పాటు పలువురు కొరియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా పక్కాగా!

**సజావుగా ఎస్ఎస్ఆర్ ప్రక్రియ.. బీఎల్ఓల తీరు భేష్**

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి**



**హైదరాబాద్, జూన్ 29 :** రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఎస్ఆర్-2026) ప్రక్రియ సజావుగా సాగాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. కేవలం 4 రోజుల్లోనే 1.73 కోట్ల ఫారాలను పంపిణీ చేసిన బీఎల్ఓల పనితీరును ఆయన అభినందించారు. విధుల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సోమవారం బీఆర్ కే భవన్ నుంచి సీఈవో సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్ఎస్ఆర్ ప్రక్రియ ప్రారంభమైన 4 రోజుల్లోనే ఇంటింటికీ తిరిగి 1.73 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడం పట్ల అధికారులను అభినందించారు. నిర్ణీత గడువులోగా 100 శాతం ఫారాలను అందజేసేలా బీఎల్ఓలను ప్రోత్సహించాలని కలెక్టర్లకు సూచించారు. బీఎల్ఓలు నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని, ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఈవో స్పష్టం చేశారు. ఎస్ఎస్ఆర్-2026 కార్యక్రమంలో రాజకీయ పార్టీలు, బూత్ స్థాయి ఏజెంట్లు చురుకుగా పాల్గొని తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సుదర్శన్ రెడ్డి సూచించారు. ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటనలు చేయాలన్నారు. ఓటరు హెల్ప్‌లైన్ 1950 తో పాటు టోల్ ఫ్రీ నంబర్లపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ప్రతిరోజూ నిర్వహిస్తున్న ఓటరు అవగాహన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సామాజిక మాధ్యమాల్లో ఆ వివరాలను ప్రచురించాలన్నారు. ఫారాలను సక్రమంగా నింపడంలో ఓటర్లకు సహాయపడే ప్రక్రియను వేగవంతం చేసేలా బీఎల్ఓలకు మరో విడత శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు సీఈవో డాక్టర్ వాసం వెంకటేశ్వర రెడ్డి, డిప్యూటీ సీఈవో జీఎస్ చారి, ఐటీ సాంకేతిక అధికారులు పాల్గొన్నారు.

# 65 ఏండ్ల వృద్ధుడికి ఉరి శిక్ష

**మూడేళ్ల బాలికపై లైంగికదాడి కేసులో మరణ దండన**

**ముంబై, జూన్ 29 :** మూడేళ్ల బాలికపై హత్యాచారానికి పాల్పడ్డ 65 ఏళ్ల వ్యక్తికి పుణెలోని ఫాస్ట్ ట్రాక్ కోర్టు మరణ శిక్ష విధించింది. ఈ కేసు అత్యంత అరుదైనదని అడిషనల్ జడ్జి ఎస్ఆర్ సాలంఖే అభిప్రాయపడ్డారు. అత్యంత పాశవిక చర్యకు పాల్పడ్డ నిందితుడు భిమ్‌రావ్ కాంబ్లేకు మరణ శిక్ష విధించక తప్పదని అన్నారు. గతంలోనూ పలు నేరాలు చేసిన చరిత్ర భీమ్‌రావ్‌ది అని పేర్కొన్నారు. ఈ కేసులో కోర్టు భీమ్‌రావ్‌ను జూన్ 25న దోషిగా తేల్చింది. తాజాగా శిక్ష ఖరారు చేసింది. మే 1న జిల్లాలోని భోర్ తెహసిల్‌లోని నస్రాపూర్ గ్రామంలో నిందితుడు దారుణానికి ఒడిగట్టాడు. చిన్నారికి మాయమాటలు చెప్పి పసువుల షెడ్డులోకి తీసుకెళ్లి దారుణానికి పాల్పడ్డాడు. చిన్నారి మృతదేహాన్ని షెడ్డులో గుర్తించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసిన అనంతరం పోలీసులు నిందితుడిని అదుపులో తీసుకున్నారు. గతంలోనూ నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు.

# బీజేపీ అధికారానికి ఎంతో దూరం లేదు!

- తెలంగాణలో అడుగడుగునా కమలం వికసిస్తుంది
- ప్రజా వ్యతిరేక ప్రభుత్వంపై బీజేపీ కార్యకర్తల పోరాటం
- సుష్మా స్వరాజ్, సర్దార్ పటేల్ సేవలను స్మరించుకున్న నితిన్ నబీన్
- బెంగాల్ తరహాలోనే తెలంగాణలోనూ బీజేపీ విజయదుందుభి
- బూత్ స్థాయి కార్యకర్తలతో ఎన్నికల వ్యూహాలపై చర్చ




**హైదరాబాద్, జూన్ 29 :** జీవితం అనేది 100 మీటర్ల పరుగుపందెం కాదని, ఓపిక, నిలకడ, శక్తితో పనిచేసినప్పుడే అద్భుత ఫలితాలు వస్తాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విద్యార్థులకు సూచించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడానికి ఎంతో దూరం లేదని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రంగారెడ్డి సహా రాష్ట్రవ్యాప్తంగా 10 జిల్లాల నూతన పార్టీ కార్యాలయాలను ఆయన ప్రారంభించారు. మేడ్చల్ జిల్లాలోని వీబీఐటీ క్యాంపస్ లో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్ లో నితిన్ నబీన్ పాల్గొన్నారు. రాజకీయాల్లో ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారని ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు ఆయన ఆసక్తికర సమాధానం ఇచ్చారు. చిన్న వయసులోనే అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చానని, ఆ తర్వాత భవిష్యత్తుపై గందరగోళంలో పడ్డానని చెప్పారు. కానీ ఏ పని చేసినా తనదైన ముద్ర ఉండాలని గట్టిగా అనుకున్నానని, అప్పగించిన పనిని నిబద్ధతతో పూర్తి చేయడమే తన బలమని వివరించారు. నేటి యువత వేగంగా లక్ష్యాలు చేరుకోవాలని ఆరాటపడుతోందని, కానీ ఏ పనైనా ఓపిక, నిలకడ, శక్తితో చేసినప్పుడే సరైన ఫలితాలు వస్తాయని దిశానిర్దేశం చేశారు.

**10 కార్యాలయాల ప్రారంభం..**

ఈ కార్యక్రమం అనంతరం రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయాన్ని నితిన్ నబీన్ ఘనంగా ప్రారంభించారు. ఇదే సందర్భంలో వర్చువల్ విధానం ద్వారా మరో 9 జిల్లాల పార్టీ కార్యాలయాలను సైతం ప్రారంభించారు. ఆ తర్వాత ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాటి నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ కు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. నాడు పార్లమెంట్ లో తెలంగాణ వాణిని బలంగా వినిపించిన దివంగత నేత సుష్మా స్వరాజ్ సేవలను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా స్మరించుకున్నారు.

**బెంగాల్ తరహాలోనే తెలంగాణలోనూ..**

గతంలో దేశవ్యాప్తంగా బీజేపీ కేవలం 2 లోక్‌సభ స్థానాలు గెలిచినప్పుడు.. అందులో ఒకటి తెలంగాణ నుంచేనని నితిన్ నబీన్ గుర్తుచేశారు. ఈ స్థాయికి చేరడానికి ఎంతో మంది పార్టీ కార్యకర్తలు తమ ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. తెలంగాణలో రాబోయే రోజుల్లో ప్రతి మూలనా కమలం వికసించి, కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. ప్రజా సమస్యలపై బీజేపీ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తారని, ప్రజావ్యతిరేక పద్ధతులను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుతారని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్ లో ఎన్ని ఆటంకాలు ఎదురైనా తీవ్రంగా సంఘర్షణ చేసి ఎలాగైతే విజయం సాధించామో, తెలంగాణలోనూ అదే పునరావృతం అవుతుందన్నారు. బెంగాల్ లో పార్టీని గెలిపించిన సునీల్ బన్సల్ ఇక్కడే ఉన్నారని, తెలంగాణలో కూడా అంతకన్నా ఎక్కువ కష్టపడి పార్టీని గెలిపించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రేణులను కోరారు.

**డబుల్ ఇంజన్ సర్కార్ తోనే అభివృద్ధి..**

ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్న 'వికసిత్ భారత్' లక్ష్యం సంపూర్ణంగా నెరవేరాలంటే తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నితిన్ నబీన్ స్పష్టం చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉండే డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే తెలంగాణ అన్ని రంగాల్లో అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల అసలైన కలలు సాకారం కావాలన్నా, ఒక వికసిత్ తెలంగాణ నిర్మాణం జరగాలన్నా ప్రజలంతా బీజేపీతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. సాయంత్రం వేళ పార్టీకి చెందిన బీఎల్ఓలు, బూత్ కమిటీ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశమైన ఆయన రాబోయే ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు.

# భూ సేకరణలో ప్రజలకు అన్యాయం జరగొద్దు

- ప్రాజెక్టు పునరుజ్జీవంతో నగరం రూపురేఖలు మార్పు
- ఇళ్లు కోల్పోయే వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం



**హైదరాబాద్, జూన్ 29 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుతో తెలంగాణ భవిష్యత్తు, హైదరాబాద్ నగర రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మూసీకి కొత్త జీవం పోస్తూ, పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రాజెక్టును తీర్చిదిద్దుతామని చెప్పారు. మూసీ ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ, పునరావాసం తదితర అంశాలపై మంత్రి పొంగులేటి సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా మార్చే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతతో మూసీ పునరుజ్జీవానికి శ్రీకారం చుట్టారని మంత్రి ఈ సందర్భంగా కొనియాడారు. దీన్ని కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమంగా మాత్రమే చూడొద్దని, భవిష్యత్ తరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన, పర్యావరణ హితమైన వాతావరణాన్ని అందించే బృహత్ సంకల్పమని వివరించారు. దశాబ్దాలుగా మూసీ కాలుష్యంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, వరదల సమయంలో ముంపు ప్రాంతాల కష్టాలను దృష్టిలో ఉంచుకునే ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశామన్నారు. వరద నియంత్రణ, నీటి శుద్ధి, పచ్చదనం పెంపు, రోడ్లు, పార్కులు, వినోద కేంద్రాల ఏర్పాటు ద్వారా మూసీ పరివాహక ప్రాంతాన్ని సరికొత్త జీవన కేంద్రంగా మారుస్తామని చెప్పారు. అభివృద్ధి పేరుతో పేదల జీవితాలు దెబ్బతినకుండా ప్రతి నిర్ణయం మానవీయ కోణంలోనే ఉంటుందని స్పష్టం చేశారు. భూ సేకరణ ప్రక్రియలో అధికారులంతా ప్రజా కోణంలో, మానవీయ దృక్పథంతో నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఈ ప్రాజెక్టు వల్ల ఇళ్లు కోల్పోయే ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణను వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. భూములు కోల్పోయే వారికి చట్టబద్ధమైన పరిహారం, అవసరమైన పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డీఎస్ లోకేశ్ కుమార్, స్టాంపులు రిజిస్ట్రేషన్ల ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, మూసీ ప్రాజెక్టు ఎండీ దాన కిషోర్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, అలాగే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# హరీష్‌కు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది!

- దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలనడం విడ్డూరం
- 5 ఏళ్ల కోసమే ప్రజలు మాకు తీర్పునిచ్చారు
- కేటీఆర్ చిల్లర విమర్శలకు వాత పెడతా
- పగటికలలు కంటున్న కమలనాథులు
- పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**హైదరాబాద్, జూన్ 29 :** బీఆర్ఎస్ నేత హరీష్ రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందని, దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలని ఆయన సవాల్ చేయడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మండిపడ్డారు. సోమవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. బీఆర్ఎస్, బీజేపీ నేతల తీరును తీవ్రంగా ఎండగట్టారు. ఈ సారి 7 రోజుల్లోనే రైతుభరోసా నిధులు జమ చేస్తామని ప్రకటించారు. తెలంగాణ ప్రజానీకం కాంగ్రెస్ పార్టీకి 5 ఏళ్ల పాటు పరిపాలించేందుకు అధికారమిచ్చారని మంత్రి పొంగులేటి గుర్తుచేశారు. "2.5 ఏళ్లకే ఎందుకు అసెంబ్లీని రద్దు చేస్తాం? మాకు ఇంకా 2.5 ఏళ్ల సమయం ఉంది. గత 2.5 సంవత్సరాలలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజల తీర్పు ఏవిధంగా ఉందో హరీష్ రావుకు తెలుసు. 2 కాళ్లు లేనివాడు చూసుకుందాం రా అని సవాలు విసిరినట్లే బీఆర్ఎస్ నాయకుల సవాళ్లు ఉంటున్నాయి" అని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చేసే మంచి పనులను జీర్ణించుకోలేక, భవిష్యత్తులో అధికారం దక్కదనే ఆవేశం, ఆక్రోశంతోనే కేటీఆర్ ఉక్రోషం వెళ్లగక్కుతున్నారని మంత్రి విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు చేసే చిల్లర విమర్శలకు తాను ప్రతిసారీ స్పందించనని, ఎప్పుడో ఒకసారి కచ్చితంగా కర్ర కాల్చి వాత పెడతానని హెచ్చరించారు. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తేనే బాంబులు పేలినట్లు కాదని, ప్రజలు ఛీ కొట్టినా బాంబులు పడ్డట్టేనన్నారు. కక్షపూరిత చర్యలు తీసుకునే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. తప్పు చేసిన వాళ్లను జైలులో వేస్తేనే శిక్షించినట్లు కాదని, ప్రతి ఎన్నికల్లో వాళ్లను ఓడించి ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారన్నారు.

**బీజేపీది ఆశ కాదు.. అత్యాశే..**

రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని బీజేపీ పగటికలలు కంటోందని పొంగులేటి విమర్శించారు. ఆశ ఉండటంలో తప్పులేదని, కానీ ఆ పార్టీ అత్యాశకు పోతోందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కనీసం డిపాజిట్ రాని పార్టీ.. అధికారం గురించి ఆశ పడుతోందని చురకలంటించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకే తాను ముక్కలని విమర్శించారు. కాళేశ్వరం అవినీతి, థర్మల్ పవర్ ప్లాంట్ అక్రమాలపై సీబీఐ విచారణ చేయాలని అడిగితే బీజేపీ ఇప్పటివరకు ఎందుకు స్పందించలేదో చెప్పాలన్నారు.

**7 రోజుల్లో రైతుభరోసా..**

ఈ సారి రైతుభరోసా నిధులను అనుకున్నదానికంటే 2, 3 రోజుల ముందే.. కేవలం 7 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటివరకు 18 నియోజకవర్గాల్లో 23 స్థలాలను గుర్తించామన్నారు. కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. భూముల ధరల సవరణల్లో ఎక్కడైనా పొరపాటుగా ఎక్కువ ధర నిర్ణయిస్తే.. వాటిని సరిచేయడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. తాండూరులో అలాగే జరిగితే వెంటనే సరిదిద్దామని గుర్తుచేశారు.

చురకలు



# కొడంగల్‌లో 33,000 దొంగ ఓట్లు!

- ఆ ఓట్లతోనే 2023 లో రేవంత్ రెడ్డి గెలుపు
- సంచలన ఆరోపణలు చేసిన కల్వకుంట్ల కవిత
- 11,000 మందికి కర్ణాటకలోనూ ఓటు హక్కు
- బోధన్ లో 7,000 ఓట్లు తీసేసి.. కొడంగల్ లో 808 మాత్రమే తీస్తారా?
- ఈసీఐ తీరుపై తీవ్ర అనుమానాలు.. తక్షణమే స్పందించాలని డిమాండ్

**హైదరాబాద్, జూన్ 29 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో ఏకంగా 33,000 డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని, ఆ దొంగ ఓట్లతోనే ఆయన గెలుపొందారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా అక్రమ వలసదారులు, అంతర్రాష్ట్ర ఓటర్లను ఏరివేయాలని, ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం (ఈసీఐ) తక్షణమే స్పందించి ప్రజలకు వివరణ ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడిన కవిత.. కొడంగల్ ఓటర్ల జాబితాపై పలు కీలక ఆధారాలను బయటపెట్టారు. గత 18 నెలల కాలంలో కొడంగల్ లోని 2.46 లక్షల ఓటర్లలో 1,00,000 మంది వివరాలను మార్చారని ఆరోపించారు. అక్కడి ఓటర్లలో 11,000 మంది పేర్లు కర్ణాటక ఓటర్ల జాబితాలోనూ ఉన్నాయని ఆధారాలతో సహా వివరించారు. 2023 ఎన్నికల్లో రేవంత్ రెడ్డి 32,000 మెజారిటీతో గెలిచారని, ఆయన మెజారిటీ కంటే ఈ 33,000 డూప్లికేట్ ఓట్లే ఎక్కువగా ఉన్నాయని విమర్శించారు. దొంగ ఓట్లతోనే రేవంత్ గెలిచారనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు.



### కొడంగల్‌కు ఒక న్యాయం.. బోధన్‌కు మరో న్యాయమా?

ఓట్ల తొలగింపు విషయంలో ఎన్నికల సంఘం తీరుపై కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బోధన్ నియోజకవర్గంలో కేవలం ఏడాది వ్యవధిలోనే 7,000 ఓట్లను తొలగించిన అధికారులు.. కొడంగల్ లో మాత్రం 808 ఓట్లను మాత్రమే ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. ఈ వ్యత్యాసాన్ని చూస్తుంటే ఎన్నికల సంఘం ముఖ్యమంత్రికి అనుకూలంగా వ్యవహరిస్తోందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ అంశంపై ఈసీఐ బహిరంగంగా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### ప్రకాష్ రాజ్ ఓటు తీయడానికే 7 ఏళ్లు పట్టింది..

దేశంలో ఇప్పటి వరకు 8 సార్లు ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) జరిగిందని, ఈ ప్రక్రియను తాము స్వాగతిస్తున్నామని కవిత చెప్పారు. అయితే అంతర్రాష్ట్ర డూప్లికేట్ ఓటర్లు, అక్రమ వలసదారుల గుర్తింపుపై ఈసీఐ పక్కాగా వ్యవహరించాలన్నారు. నటుడు ప్రకాష్ రాజ్ కు 2 చోట్ల ఓట్లు ఉంటే వాటిని తొలగించేందుకు 7 ఏళ్లు పట్టిందని గుర్తుచేశారు. ఈ అంతర్రాష్ట్ర దొంగ ఓట్ల వ్యవహారంపై త్వరలోనే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని కవిత స్పష్టం చేశారు.

# కేంద్రం కరుణిస్తేనే.. పల్లె ప్రగతి!

- ఢిల్లీ సదస్సులో సీతక్క గళం
- 60:40 నిధుల విధానంపై అసంతృప్తి
- ఉపాధి హామీలో పాత విధానమే ఉండాలి
- జూలై 2 న రాష్ట్ర క్యాబినెట్ కీలక నిర్ణయం
- కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ కు వినతిపత్రం

**న్యూఢిల్లీ జూన్ 29 :** ఢిల్లీ వేదికగా జరిగిన జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో తెలంగాణ గళాన్ని రాష్ట్ర మంత్రి సీతక్క బలంగా వినిపించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెస్తున్న 60:40 నిధుల విధానంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను కలిసి పెండింగ్ నిధులు, అటవీ అనుమతులపై కీలక వినతిపత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి పథకాలకు సంబంధించి తీసుకొస్తున్న కొత్త నిధుల విధానాలపై రాష్ట్ర మంత్రి సీతక్క తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ఢిల్లీలో జరిగిన జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నారు. వికసిత్ గ్రామాలు 2047 ఆశయం నెరవేరాలన్నా, పల్లెలు స్వయంసమృద్ధి సాధించాలన్నా రాష్ట్రాలపై కేంద్రం అదనపు ఆర్థిక భారం మోపకూడదని ఆమె స్పష్టం చేశారు. కొత్తగా ప్రతిపాదించిన 60:40 నిధుల విధానంతో రాష్ట్రాలపై ఊహించని రీతిలో భారం పడుతుందన్నారు. ఈ నిబంధనలపై జూలై 2 న జరగబోయే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.



### ఉపాధి హామీలో పాత వాటాయే..

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పాత విధానాన్నే కొనసాగించాలని మంత్రి డిమాండ్ చేశారు. వేతనాలకు 100 శాతం, మెటీరియల్ కాంపోనెంట్ కు 75 శాతం కేంద్ర వాటాను యథాతథంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ నుంచి పన్నుల వాటా తీసుకుంటున్నప్పుడు కేంద్ర పథకాలను రాష్ట్రంలో పక్కాగా అమలు చేయాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వద్దనడంతో ఆగిపోయిన పీఎం ఆవాస్ యోజన ఇళ్లను వెంటనే రాష్ట్రానికి కేటాయించాలని ఆమె పట్టుబట్టారు.

### అటవీ అనుమతులపై ఆవేదన..

పీఎంజీఎస్వై కింద చేపట్టే గ్రామీణ రోడ్లకు అటవీ శాఖ అనుమతులు ప్రధాన అడ్డంకిగా మారాయని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ దృష్టికి సీతక్క తీసుకెళ్లారు. ఆదిలాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్లమల అటవీ ప్రాంతాల్లో అనేక రోడ్డు పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రోడ్లే కాకుండా ఏజెన్సీ ప్రాంతాల్లోని పేదలకు ఇళ్లు, బోరుబావులు, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయని వివరించారు. క్లియరెన్స్ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. నిధుల విడుదలలో కేంద్రం జాప్యం చేస్తోందని, అధికారుల బదిలీల వల్ల నివేదికలు ఇవ్వడంలో రాష్ట్రం వైపు నుంచి కూడా కొంత ఆలస్యం జరిగిందని ఆమె అంగీకరించారు.

### అవార్డుల పంట..

ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ గ్రామీణాభివృద్ధిలో తెలంగాణ అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోందని సీతక్క హర్షం వ్యక్తం చేశారు. జల సంచార్ విభాగంలో రాష్ట్రానికి ఏకంగా 13 జాతీయ అవార్డులు వచ్చాయన్నారు. దేశవ్యాప్తంగా 100 రోజుల ఉపాధి కల్పనలో తెలంగాణ రెండో స్థానంలో నిలిచిందని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# భారీగా అటవీ అధికారుల బదిలీలు

### అరణ్య భవన్‌కు వి.ఎస్.ఎన్.వి. ప్రసాద్

**హైదరాబాద్,జూన్29 :** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో పలువురు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉత్తర్వులను జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు అందరూ తక్షణమే తమ పాత విధులను వదిలి, కొత్తగా కేటాయించిన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేశారు. ప్రస్తుతం పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న వి.ఎస్.ఎన్.వి. ప్రసాద్ అరణ్య భవన్‌లో కీలక బాధ్యతలు అప్పగించింది . హైదరాబాద్‌లోని ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ కార్యాలయంలో ఆయనను కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు కొత్త అటవీ అధికారులను కేటాయిస్తూ ప్రభుత్వం బదిలీల జాబితాను విడుదల చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ అధికారిగా ఉన్న జి. కిష్ట గౌడ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అటవీ అధికారిగా బదిలీ కాగా, ఆయన స్థానంలో నిజామాబాద్ జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, ఎఈ÷ూ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ అధికారిగా నియమించారు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, ఎఈ÷ూ ను రంగారెడ్డి జిల్లా అటవీ అధికారిగా బదిలీ చేయగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అటవీ అధికారిగా ఉన్న ఎం. నవీన్ రెడ్డి, ఎఈ÷ూను మహబూబ్‌నగర్ జిల్లా అటవీ అధికారిగా నియమించారు. మరోవైపు ఆదిలాబాద్ జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఎఈ÷ూ ను నిజామాబాద్ జిల్లా అటవీ అధికారిగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాల అధికారుల మార్పులతో పాటు ఆదిలాబాద్ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్‌గా సేవలందిస్తున్న చిన్న విశ్వనాథ్ భూసారెడ్డికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆమె తన ప్రస్తుత విధులను కొనసాగిస్తూనే, ఆదిలాబాద్ జిల్లా అటవీ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుందని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.




# పలువురు ఐపీఎస్‌ల బదిలీ

### ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, జూన్ 29:** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పోలీసు శాఖలో ఐపీఎస్, ఎస్పీఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగులు చేపట్టింది. ఈ మేరకు జీఓ ఆర్.టి. నెం.931ను జారీ చేసింది. పలువురు అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించగా, మరికొందరికి అదనపు బాధ్యతలు కేటాయించింది. రామగుండం పోలీస్ కమిషనర్‌గా కొనసాగుతున్న అంబర్ కిశోర్ ఝూకు డీఐజీ, జోన్-1 (కాళేశ్వరం) అదనపు బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి. జోయెల్ డేవిస్‌కు డీఐజీ, జోన్-5 (యాదాద్రి) బాధ్యతలు కూడా అప్పగించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సన్‌ప్రీత్ సింగ్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ, డీఐజీ జోన్-3 (రాజన్న) అదనపు బాధ్యతలు ఇచ్చారు. హైదరాబాద్ నార్త్ రేంజ్ (లా అండ్ ఆర్డర్) జాయింట్ కమిషనర్‌గా ఉన్న ఎన్. శ్వేతను వరంగల్ పోలీస్ కమిషనర్‌గా నియమిస్తూ, డీఐజీ జోన్-4 (భద్రాద్రి) బాధ్యతలు కూడా అప్పగించారు. ఇంటెలిజెన్స్ సీఐ సెల్ డీఐజీగా కొనసాగుతున్న ఆర్. భాస్కరన్‌కు జోన్-2 (బాసర) డీఐజీ అదనపు బాధ్యతలు కేటాయించారు. స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ ఎస్.ఎం. విజయ్ కుమార్‌కు హైదరాబాద్ నార్త్ రేంజ్ జాయింట్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న చి. సింధు శర్మను ఇంటెలిజెన్స్ సీఐ సెల్ ఎస్పీగా బదిలీ చేసి, ఎస్ఐబీ ఎస్పీ బాధ్యతలు కూడా అప్పగించారు. ఎస్ఐబీ ఎస్పీగా ఉన్న వై. సాయి శేఖర్‌ను సికింద్రాబాద్ రైల్వే పోలీస్ ఎస్పీగా బదిలీ చేశారు. హైదరాబాద్ డీసీపీ (ఎస్ఎం అండ్ ఐటీ)గా ఉన్న చెన్నూరి రూపేష్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ చి. ప్రవీణ్ కుమార్లను సీఐడీ ఎస్పీలుగా నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆర్. వెంకటేశ్వర్లును హైదరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీగా నియమించారు. వనపర్తి అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఉన్న రాజేష్ మీనాను వికారాబాద్ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బదిలీ చేశారు. వికారాబాద్ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఉన్న బి. రాములు నాయక్‌ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేసి, డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# సింగరేణి అధికారుల సమస్యలు పరిష్కరించాలి

### కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ రిలే నిరాహారదీక్షలు

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 29:** సింగరేణి అధికారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ దీక్షలు జూలై 13 వరకు కొనసాగనున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. రానున్న రోజుల్లో వివిధ విభాగాలకు చెందిన అధికారులు దశలవారీగా దీక్షలను కొనసాగించనున్నట్లు సంఘం ప్రకటించింది. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. సింగరేణి అధికారులకు న్యాయమైన హక్కులు లభించే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. కోల్ ఇండియా అధికారులకు అమలు చేస్తున్న విధానాలను సింగరేణి అధికారులకు కూడా వర్తింపజేయాలని కోరారు. కోల్ ఇండియా తరహాలో సింగరేణి అధికారులకు పే అప్‌గ్రేడేషన్ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్పీ బకాయిలను వెంటనే చెల్లించాలని అన్నారు. కోల్ ఇండియా అధికారులతో సమానంగా అలవెన్సులు, ఇతర సర్వీస్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. సింగరేణికి రావాల్సిన బకాయిలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలన్నారు.

# మధిర సభ రద్దు

### ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలతో మారిన వేదిక
### హైదరాబాద్ నుంచి రైతుభరోసా నిధుల విడుదల
### నేడు శిల్పకళా వేదికగా సదస్సు నిర్వహణ
### వర్చువల్ విధానంలో పాల్గొననున్న రాష్ట్రవ్యాప్త రైతులు
### ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సీఎం ఆదేశం

**హైదరాబాద్ జూన్ 29 :** ఖమ్మం జిల్లా మధిరలో మంగళవారం జరగాల్సిన రైతు ఆశీర్వాద సభ భారీ వర్షాల కారణంగా రద్దయింది. రెండు రోజులుగా కురుస్తున్న వానలకు సభా ప్రాంగణంలో భారీగా వరద నీరు చేరడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వాతావరణం అనుకూలించని నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ లోని శిల్పకళా వేదికకు మార్చారు. మంగళవారం సాయంత్రం ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుభరోసా నిధులను విడుదల చేయనున్నారు.ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురంలో మంగళవారం రైతు ఆశీర్వాద సభ జరగాల్సి ఉంది. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై రైతుభరోసా నిధులను విడుదల చేయాలని ముందుగా నిర్ణయించారు. కానీ వర్షాల కారణంగా సభ నిర్వహించే పరిస్థితి ఏమాత్రం లేకపోవడంతో ముఖ్యమంత్రి సభ వేదికలో ప్రభుత్వం మార్పులు చేసింది. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ లోని శిల్పకళా వేదికకు మార్చింది. మంగళవారం సాయంత్రం ఈ వేదికలోనే రైతుభరోసా పంపిణీ సదస్సు నిర్వహించనున్నారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి రైతుభరోసా నిధులను విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని మంత్రులు, అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### నీట మునిగిన ప్రాంగణం..

జగన్నాధపురంలో దాదాపు లక్ష మందితో సభ నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు తగ్గట్టుగానే భారీగా ఏర్పాట్లు చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. అయితే రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సభా ప్రాంగణంలో పెద్ద ఎత్తున వరద నీరు చేరుకుంది. దీంతో సభ నిర్వహించేందుకు ఏమాత్రం అవకాశం లేదని మంత్రులు, సీఎంవో కార్యాలయానికి జిల్లా అధికారులు తెలియజేశారు. పరిస్థితిని సమీక్షించిన ప్రభుత్వం మధిరలో సభను రద్దు చేసి వేదికను హైదరాబాద్ కు మార్చింది.రైతు ఆశీర్వాద సభ వేదిక హైదరాబాద్ కు మారిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి రైతులు తమ తమ రైతు వేదికల నుంచి ఈ సమావేశంలో వర్చువల్ గా పాల్గొననున్నారు. ఈ మేరకు అన్ని జిల్లాల అధికారులకు ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది.

# రైతులకు కాంగ్రెస్ ద్రోహం!

### హామీల అమలులో సర్కారు విఫలం
### ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ ఏదీ?
### అన్నదాతలకు వేముల ప్రశాంత్ రెడ్డి ఏరువాక శుభాకాంక్షలు
### మంత్రులు, ఎమ్మెల్యేలను నిలదీస్తున్న ప్రజలు
### మహిళలకు నెలకు రూ.2,500 వెంటనే ఇవ్వాలి

**నిజామాబాద్ జూన్ 29 :** రైతు భరోసా, రుణమాఫీ, మహిళలకు సాయం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేస్తోందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ ధ్వంసమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతలకు ఆయన ఏరువాక పున్నమి శుభాకాంక్షలు తెలిపారుచ రైతులు ఆనందంగా ఉంటేనే దేశం ఆరోగ్యంగా ఉంటుందని, వారి కష్టఫలితమే మనం ముద్ద మింగుతున్నామని వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులను పూర్తిగా విస్మరించిందన్నారు. కేసీఆర్ హయాంలో నాట్లు వేసే సమయానికే రైతు బంధు నిధులు జమయ్యేవని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదన్నారు. ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పటివరకు రూ.30 వేల కోట్ల రైతు భరోసా నిధులను ఎగ్గొట్టిందని ఆయన విమర్శించారు. మళ్లీ ఇప్పుడు కొత్తగా వానాకాలం రైతు భరోసా ఇస్తామని చెబుతున్నారని, అంతకన్నా ముందు ఇప్పటివరకు ఎగ్గొట్టిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎరువుల కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కేసీఆర్ ఉన్నప్పుడు ఎరువుల కొరత లేకుండా గోదాముల్లో నిల్వ ఉంచేవారని గుర్తుచేశారు.



### రుణమాఫీలో అబద్ధాలు..

రైతు రుణమాఫీ, రైతు భరోసా విషయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున అబద్ధాలు చెబుతోందని వేముల మండిపడ్డారు. అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని నమ్మబలికి.. సగం మందికి కూడా మాఫీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం రూ.45 వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉండగా.. కేవలం రూ.20 వేల కోట్లు మాత్రమే చేశారని, ఇంకా రూ.25 వేల కోట్లు రైతులకు సర్కారు బాకీ పడిందని లెక్కలు చెప్పారు.

### ఆడబిడ్డలకూ అన్యాయం..

మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి 30 నెలలుగా ఎగ్గొట్టారని వేముల ఆరోపించారు. ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ.75 వేల చొప్పున బాకీ పడిందన్నారు. పెళ్లిళ్లకు తులం బంగారం ఇస్తామని చెప్పి దాదాపు 3 లక్షల మంది ఆడబిడ్డలను మోసం చేశారని ఆయన మండిపడ్డారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని మోసపు మాటలు చెప్పడం ఆపి.. ముందుగా బాకీ పడిన నెలకు రూ.2,500 చొప్పున బకాయిలు, తులం బంగారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

### ప్రజలు నిలదీస్తున్నారు..

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడికి వెళ్లినా ప్రజలు నిలదీస్తున్నారని వేముల తెలిపారు. 14 ఏండ్ల పాటు సుదీర్ఘ పోరాటం చేసి, ప్రాణాలను సైతం పణంగా పెట్టి తెలంగాణ సాధించిన కేసీఆర్.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలను గుండెల్లో పెట్టుకుని కాపాడుకున్నారని గుర్తుచేశారు. రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ గా తీర్చిదిద్దారని, కానీ నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణను పూర్తిగా ధ్వంసం చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

చురకలు

మంగళవారం 30 జూన్ 2026



# మళ్లీ మొదటికొచ్చిన పశ్చిమసియా!

ట్రంప్ ప్రంపచానికి పట్టిన పీడలాగా తయారయ్యాడు. అటు దేశ ప్రజలకు, ఇటు ప్రపంచ ప్రజలకు ఎప్పుడీ పీడ విరగడ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. శాంతి చర్చల అనంతరం ఒప్పందం చేసుకున్న తరవాత కూడా ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడంతో పశ్చిమాసియాను మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. ట్రంప్ చేస్తున్న ప్రకటనలకు, చర్యలకు పొంతన లేకుండ ఆపోయింది. దీంతో మళ్లీ యుద్ధం వస్తుందా అన్న భయంలో అనేక దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఇకపోతే ఇటలీవల చేసుకున్న ఒప్పందాన్ని కూడా ట్రంప్ ఖాతరు చేయలేదు. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందానికి పురిట్లోనే గండిపడింది. శనివారం మొదలైన పరస్పర దాడులు ఆదివారం మరింత ఉధృతం కావడంతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చిందా అన్న ఆందోళన కలుగుతోంది. దాడులు ఆపకుంటే ఇరాన్‌ను భూమ్మీదే లేకుండా చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు హెచ్చరించగా... తమ జోలికి వస్తే అమెరికాకు నరకం చూపిస్తామంటూ ఇరాన్ కూడా అంతేదీటుగా స్పందించింది. దీనితో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. హోర్ముజ్ జలసంధిలో తమ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రయాణిస్తోందంటూ ఎవర్ లవ్లీ అనే వాణిజ్య నౌకపై ఇరాన్ డ్రోన్ దాడి చేయడంతో ఉద్రిక్తత మొదలైంది. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందంటూ.. శనివారం హోర్ముజ్ జలసంధికి సమీపంలో ఇరాన్‌లోని లక్ష్యాలపై అమెరికా యుద్ధ విమానాలతో దాడులు చేసింది. దీనితో గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపైకి ఇరాన్ డ్రోన్లు క్షిపణులను ప్రయోగించింది. అమెరికా దాడులపై ఇరాన్ దీటుగా స్పందించింది. కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. కువైట్‌లోని అలీ అల్ సలేం వైమానిక స్థావరం, బహ్రెయిన్ పోర్ట్ సల్మాన్ వద్ద ఉన్న అమెరికా ఐదో నావికాదళ స్థావరం సహా ఎనిమిది కీలక సైనిక కేంద్రాలను ధ్వంసం చేశామని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) పేర్కొంది. అమెరికా చేసే ఎలాంటి దాడులకైనా మా స్పందన అత్యంత విధ్వంసకరంగా ఉంటుందని హెచ్చరించింది. కాగా, తమ దేశంవైపు వస్తున్న క్షిపణులు, డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలతో విజయవంతంగా అడ్డుకుంటున్నామని కువైట్ ప్రకటించింది. అయితే హోర్ముజ్ జలసంధిలో పనామా జెండాతో ప్రయాణిస్తున్న భారీ చమురు ట్యాంకర్ నౌక 'కికు'పై శనివారం రాత్రి దాడి జరిగింది. ఇది ఇరాన్ పనేనంటూ అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం తెల్లవారుజామున పర్షియన్ గల్ఫ్‌లోని ఇరాన్ దీవి 'ఖెష్మ్'పై, హోర్ముజ్ జలసంధి సమీపతీరంలోని సిరిక్, బందర్ ఈ లెంగే నగరాల్లో 10 ప్రాంతాలపై భారీస్థాయిలో దాడులు చేసింది. ఇరాన్ నిఘా, కమ్యూనికేషన్ వ్యవస్థలు, గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్లు, సముద్ర మందుపాతరల నిల్వ కేంద్రాలను ధ్వంసం చేసినట్టు ప్రకటించింది. ఈ దాడులకు సంబంధించి 38 సెకన్ల వీడియోను విడుదల చేసింది. పరస్పర దాడు లు కొనసాగుతున్నా హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయని.. అమెరికా నౌకాదళం పూర్తి అప్రమత్తత ఉందని పేర్కొంది. అమెరికా, ఇరాన్ చర్చలకు మధ్యవర్తిగా ఉన్న పాకిస్థాన్.. తాజా ఉద్రిక్తతలను తగ్గించేందుకు ప్ర యత్నాలు మొదలుపెట్టింది. దీనిపై పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఇరుదేశాల ప్రతినిధులను సంప్రదించారు. కాల్పుల విరమణ, అవగాహన ఒప్పందానికి కట్టుబడి ఉండాలని కరారు. ఇక యూరోపియన్ యూనియన్ విదేశాంగ విధానం చీఫ్ కాజా కల్లాస్, బహ్రెయిన్ విదేశాంగ మంత్రి రషీద్ కూడా ఇషాక్‌దార్‌తో మాట్లాడారు. కాగా కువైట్, బహ్రెయిన్‌లపై ఇరాన్ దాడులను గల్ఫ్ దేశాల కూటమి 'గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)' ఖండించింది. వెంటనే దాడులు ఆపాలని విజ్ఞప్తి చేసింది. అమెరికా చేసే ప్రతీ దాడికీ తమ ప్రతిదాడి ఉంటుందని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. కాల్పుల విరమణను అమెరికాయే ఉల్లంఘిస్తోందని, ఇది ఇలాగే కొనసాగితే శాంతి ఒప్పందం కోసం జరుగుతున్న దౌత్య ప్రయత్నాలన్నీ నిలిచిపోతాయని స్పష్టం చేసింది. ఈ మేరకు ఐఆర్‌జీసీ నావికాదళ కమాండర్ ప్రకటన చేశారు. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా తప్పుబట్టారు. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. ఇరాన్ మళ్లీ కాల్పు ల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో మా సైన్యం దాడులు చేయాల్సి వచ్చింది. ఇరాన్ ఎప్పటికీ పాఠం నేర్చుకునేలా కనిపించడంలేదు. మా సహనానికి హద్దు అంటూ ఉంటుంది. అది దాటితే మేం సైన్యంతోనే పని పూర్తి చేయాల్సి వస్తుంది. అదే జరిగితే ఇక ఇరాన్ అనే దేశమే ఉండదని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. విదేశాల నుంచి భారత్‌కు సరుకు రవాణా చేస్తున్న ఏడు కార్గో నౌకలు గత మూడు రోజుల్లో హోర్ముజ్ జలసంధిని దాటాయి. వీటిలో 65 వేల టన్నుల రసాయన ఎరువులు తీసుకొస్తున్న రెండు నౌకలు శనివారం ఈ మార్గం గుండా వచ్చాయి. అంతకుముందు రోజు లక్ష టన్నులకు పైగా ముడి చమురుతో 'దేశ్ సురక్ష' ట్యాంకర్, 18,732 టన్నుల సరుకుతో 'ప్రభు పార్వతి' నౌక ఇదే మార్గం గుండా భారత్‌కు వచ్చాయి. ఇవిగాక మరో రెండు విదేశీ నౌకలు ఇదే మార్గంలో ప్రయాణించాయి. హోర్ముజ్ ద్వారా భారత్‌కు రావాల్సిన మరో 15కు పైగా నౌకలు తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్‌లో వేచి ఉన్నాయి. వీటిలో భారతీయ జెండా గల 10 నౌకలు ఉన్నాయి. వాటిలో నాలుగు ఎరువులను, మరొకటి ఇంధనాన్ని తీసుకురానున్నాయి. ఇప్పుడు ఉద్రిక్తతల కారణంగా పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆందోళన కలుగుతోంది.

# అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

- అత్యవసర విచారణకు సుప్రీం తిరస్కరణ
- అంత తొందరెందుకని పిటిషన్‌కు ధర్మాసనం ప్రశ్న

**న్యూఢిల్లీ, జూన్ 29 :** అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. ఈ ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు. కోర్టు పర్యవేక్షణలో, నిర్ణీత కాలవ్యవధిలో దర్యాప్తు జరిగేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే ఈ పిటిషన్ అత్యవసర విచారణకు సుప్రీం నిరాకరించింది. అయోధ్య రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం జరిగిందంటూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్య వసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జ స్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, రామమందిర విరాళాల నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని, ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర విచారణ జరిపించాలని కోర్టును కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోందని, అందుకే స్వతంత్ర దర్యాప్తు అవసరమని ఆయన వాదించారు. ఇక, కేసు ఆలస్యమైతే ఎలక్ట్రానిక్ ఆధారాలు చెరిపివేసే అవకాశం ఉందని పి టిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కోర్టు, మెన్షన్ స్లిప్ సర్క్యులేట్ చేయాలని సూచించింది. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తిరిగి ప్రారంభమైన వెంటనే ఈ కేసును లిస్ట్ చేసి విచారణ చేపడతామని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ప్రస్తుతం ఈ అంశంపై అత్యవసర విచారణ అవసరం లేదని స్పష్టం చేసింది. ఈలోపే మిన్ను విరిగి మీద పడదు.. అంత తొందరెందుక'ని పిటిషనర్‌ను ప్రశ్నించింది. మరోవైపు, ఈ కేసులో నిందితుల పక్షాన ఎవరూ వాదించొద్దన్ని ÷జాబాద్ బార్ అసోసియేషన్ నిర్ణయించింది. 'ఈ కేసులో నిందితుల తరఫున ఎవరూ వాదించరు. ఒకవేళ ఎవరైనా అలా చేస్తే.. క్రమశిక్షణా చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది. వారికి రూ.5లక్షలు జరిమానా విధిస్తాం' అని అసోసియేషన్ అధ్యక్షుడు కలికా ప్రసాద్ మిశ్రా మీడియాకు వెల్లడించారు. 2005లో కూడా అక్కడి న్యాయవాదులు ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారు. ఆ ఏడాది రామ మందిరంపై దాడికి పాల్పడిన నిందితులను ఫైజజాబాద్ కోర్టు ముందు హాజరుపర్చగా.. వారి పక్షాన వాదించేందుకు ఎవరూ ముందుకురాలేదు.



## అయోధ్య విరాళాల కేసు నిందితులకు లాయర్లు దూరం

**వాదించబోమని బార్ అసోసియేషన్ సంచలన తీర్మానం**

**ఉల్లంఘిస్తే రూ.5 లక్షల జరిమానా**

**అయోధ్య, జూన్ 29:** అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో అరెస్టైన ఎనిమిది మంది నిందితుల తరఫున తమ సంఘానికి చెందిన ఏ న్యాయవాదీ కోర్టులో వాదించరాదని అయోధ్య బార్ అసోసియేషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ తీర్మానాన్ని ఉల్లంఘించే న్యాయవాదులపై రూ.5 లక్షల జరిమానా విధిస్తామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాళికా శరణ్ మిశ్రా ప్రకటించారు. నిందితులను స్థానిక కోర్టులో హాజరుపరిచిన రోజే నిర్వహించిన బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. రామాలయానికి భక్తులు సమర్పించిన విరాళాల దుర్వినియోగం ఆరోపణలు ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని అసోసియేషన్ తెలిపింది. అదే సమావేశంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా, ఆలయ నిర్మాణ ఇన్‌ఛార్జి గోపాల్‌రావుపై కూడా కేసు నమోదు చేయాలని తీర్మానించింది. వీరు మూడు రోజుల్లో అయోధ్యను వీడాలని, లేనిపక్షంలో నగర బంద్‌తో పాటు ఆలయ దిగ్బంధన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించింది. కాగా, 2005లో రామ జన్మభూమి తాత్కాలిక ఆలయంపై జరిగిన ఉగ్రదాడి కేసులోనూ నిందితుల తరఫున వాదించబోమని ఇదే బార్ అసోసియేషన్ అప్పట్లో ప్రకటించిన విషయం తెలిసిందే.

# ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం

**ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేందకరన మోడీ**



**విక్టోరియా, జూన్ 29 :** భారత్-సీషెల్స్ మధ్య ఉన్న చిరకాల స్నేహబంధానికి అద్దం పట్టేలా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుగుతోంది. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా సీషెల్స్‌కు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ జాతీయ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమవారం భారత ఆర్మీ, నౌకాదళ దళాలు కవాతు నిర్వహించగా.. వారికి గౌరవ సూచకంగా ప్రధాని మోదీ లేచి నిలబడటం కార్యక్రమానికి విశేషంగా నిలిచింది. రాజధాని విక్టోరియాలో నిర్వహించిన గో÷-డలెన్ జూబ్లీ పరేడ్‌లో భారత ఆర్మీకి చెందిన అస్సాం రెజిమెంట్ సైనికులు, భారత నౌకాదళానికి చెందిన సిబ్బంది కవాతు నిర్వహించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా అస్సాం రెజిమెంట్ జవాన్లు తమ ప్రసిద్ధ రెజిమెంటల్ గీతం 'బద్లు రామ్ కా బదన్' ఆలపిస్తూ మార్చ్ చేయడం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో భారత నౌకాదళానికి చెందిన అత్యాధునిక స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తార్కష్, స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఐఎన్ఎస్ ఇక్షాక్ సర్వే నౌకలూ పాల్గొన్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం మరింత బలపడుతున్న సంకేతాలు స్పష్టం అయ్యాయి. ఈ సందర్భంగా భారత నౌకాదళం స్పందించింది. సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవాల్లో ఐఎన్ఎస్ తార్కష్, ఐఎన్ఎస్ ఇక్షాక్ నౌకలు, భారత నౌకాదళ బ్యాండ్, మార్చింగ్ కంటింజెంట్ పాల్గొన్నాయని తెలిపింది. ఇది భారత్-సీషెల్స్ సముద్ర సహకారానికి ప్రతీకని పేర్కొంది. మరోవైపు, ఈ వేడుకల అనంతరం ప్రధాని మోదీ కూడా ఎక్స్‌లో స్పందించారు. ఈ సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీ ఆతిథ్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'అస్సాం రెజిమెంట్, భారత నౌకాదళ దళాలు సీషెల్స్ జాతీయ దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడం ఇరు దేశాల మధ్య ఉన్న చిరస్థాయి స్నేహానికి మరో నిదర్శనం' అని ప్రధాని పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోదీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' లభించింది. దీనిని ఆ దేశ ప్రధాని ప్యాట్రిక్ హెర్మినీ.. భారత ప్రధానికి అందజేశారు.

# జీవితం పరుగు కాదు.. ఓపికతోనే విజయం

- నిలకడ, క్రమశిక్షణతో లక్ష్యాలు సాధించాలని విద్యార్థులకు నితిన్ నబీన్ సూచన
- తెలంగాణలో బీజేపీ అధికారానికి ఎంతో దూరం లేదన్న జాతీయ అధ్యక్షుడు





**హైదరాబాద్, జూన్ 29:** జీవితం వంద మీటర్ల పరుగుపందెం కాదని, ఓపిక, నిలకడ, క్రమశిక్షణతో ముందుకు సాగితేనే విజయాలు సాధ్యమవుతాయని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లోని వీబీఐటీ కళాశాలలో నిర్వహించిన 'వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్' కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానంగా మాట్లాడుతూ.. చిన్న వయసులోనే రాజకీయాల్లోకి వచ్చిన తనకు అనేక సవాళ్లు ఎదురయ్యాయని, అయితే అప్పగించిన ప్రతి బాధ్యతను నిబద్ధతతో పూర్తి చేయడమే తన విజయానికి కారణమని చెప్పారు. నేటి యువత వేగంగా ఫలితాలు కోరుకుంటోందని, కానీ ఏ రంగంలోనైనా స్థిరమైన విజయానికి సహనం, కృషి, అంకితభావమే అసలైన బలం అని సూచించారు. అనంతరం రంగారెడ్డి జిల్లా గ్రామీణ బీజేపీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన నితిన్ నబీన్, వర్చువల్ విధానంలో మరో తొమ్మిది జిల్లాల పార్టీ కార్యాలయాలను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నిజాం పాలన నుంచి తెలంగాణ విముక్తికి కృషి చేసిన సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు, తెలంగాణ ఉద్యమ అమరవీరులకు, దివంగత సుష్మా స్వరాజ్‌కు ఘన నివాళులు అర్పించారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా బీజేపీకి వచ్చిన రెండు లోక్‌సభ స్థానాల్లో ఒకటి తెలంగాణ నుంచేనని గుర్తు చేసిన ఆయన, కార్యకర్తల త్యాగాల వల్లే పార్టీ ఈ స్థాయికి చేరిందన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే రోజు ఎంతో దూరంలో లేదని, రాష్ట్రవ్యాప్తంగా కమలం వికసించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాడుతుందని, ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలే గద్దె దించుతారని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో సాధించిన విజయాన్ని తెలంగాణలో కూడా పునరావృతం చేస్తామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశయమైన 'వికసిత్ భారత్' సాధనకు తెలంగాణలో కూడా బీజేపీ ప్రభుత్వం అవసరమని పేర్కొన్న నితిన్ నబీన్, కేంద్రం-రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉండే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడితే తెలంగాణ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అభిప్రాయపడ్డారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయానికి కార్యకర్తలంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సాయంత్రం పార్టీ బీఎల్ఓలు, బూత్ కమిటీ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశమైన ఆయన, రాబోయే ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు.

# వర్షా కాలంలో ప్రజారోగ్య పరిరక్షణ పై ప్రత్యేక దృష్టి





జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ జూన్ 29:**

తాగునీరు, పారిశుద్ధ్యం, ఆహార భద్రతపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

వర్షాకాలంలో ప్రజారోగ్య పరిరక్షణకు తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఆహార భద్రత అంశాలపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు.ప్రజావాణి అనంతరం నిర్వహించిన జిల్లా వాటర్ అండ్ శానిటేషన్, ఫుడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, అంగన్‌వాడీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, విద్యాసంస్థల్లో తాగునీటి సమస్యలు లేకుండా తక్షణ చర్యలు తీసుకో వాలని సూచించారు. వర్షాకాలంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలని, ఓపెన్ డ్రైనేజీలను నిరంతరం శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధుల నివారణకు ప్రతి శుక్రవారం నిర్వహించే 'డ్రై డే' కార్యక్ర మాలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. హైకోర్టులో జిల్లా కలెక్టర్ పార్టీగా ఉన్న కేసుల వివరాలను చివరి నిమిషంలో కాకుండా ముందుగానే తన దృష్టికి తీసుకురావాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఆహార భద్రత విషయంలో ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా ఉందని పేర్కొన్న కలెక్టర్, హాస్టళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశుభ్రత, ఆహార నాణ్యత, గడువు ముగిసిన ఆహార పదార్థాల వినియోగంపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఫుడ్ సేఫ్టీ అధికా రులను ఆదేశించారు. గ్రామస్థాయిలో కూడా పరిశుభ్రత, సురక్షిత ఆహారంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, డి.ఆర్.ఓ నిర్మలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గోదావరిఖనిలో సింగరేణి ఏరియా ఆసుపత్రిలో అత్యాధునిక తొలి క్యాథ్ ల్యాబ్ సిద్ధం

**గోదావరి ఖని జూన్29:.**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ గోదావరిఖని రామగుండం-1 ఏరియా ఆసుపత్రిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ఏడాదిలోనే పూర్తయిన ఈ కేంద్రం త్వరలో ప్రారంభం కానుంది. గుండెపోటు వచ్చిన తొలి "గోల్డెన్ అవర్"లోనే యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, స్టెంట్ అమరిక వంటి అత్యవసర చికిత్సలు స్థానికంగానే అందు బాటులోకి రానున్నాయి.

ఈ క్యాథ్ ల్యాబ్ ద్వారా పెద్దపల్లి, మంచిర్యాల, కొమురం భీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలతో పాటు మొత్తం కోల్ బెల్ట్ ప్రాంత ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. 7,890 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ఐసీసీయూ, ఐసీయూ, ఔట్‌పేషెంట్ విభాగాలు అందుబాటులో ఉంటాయి.

ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంపై ఏడేళ్లలో సింగరేణి సుమారు రూ.50 కోట్లు వెచ్చించ నుండగా, నెలకు సుమారు 3 వేల మందికి సేవలు అందే అవకాశం ఉంది. బెడ్ సామర్థ్యంలో 50 శాతం సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులకు కేటాయించ నున్నారు. స్థానికంగానే అత్యాధునిక గుండె వైద్యం అందించడం ద్వారా వేలాది ప్రాణాలను కాపాడగల కేంద్రంగా ఇది నిలుస్తుందని సింగరేణి యాజమాన్యం తెలిపింది.




# భారీ వర్షాలతో రైతు ఆశీర్వాద సభ వాయిదా



**ఖమ్మం జూన్29:.**

ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో జూన్ 30న నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభను భారీ వర్షాల కారణంగా వాయిదా వేసినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. సభా ప్రాంగణం బురదమయంగా మారడంతో రైతులు, ప్రజలు, కార్యకర్తలకు ఇబ్బందులు కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రైతు భరోసా పంపిణీ పూర్తైన తర్వాత ఈ కార్యక్రమాన్ని మరింత ఘనంగా 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని చెప్పారు. వాతావరణ పరిస్థితులను బట్టి జూలై 6, 7 లేదా 8 తేదీల్లో సభ నిర్వహించే అవకాశముందని వెల్లడించారు. సీఎం, మంత్రివర్గ సభ్యుల సమక్షంలో ఈ సభను అత్యంత విజయవంతంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

# రూ.13 వేల కోట్ల రోడ్ల పనులకు శంకుస్థాపన

### బీఆర్ఎస్, బీజేపీపై సీఎం రేవంత్ ఘాటు విమర్శలు

**నల్గొండ, జూన్ 29::.**

రాష్ట్రంలో రూ.13 వేల కోట్ల వ్యయంతో 6,300 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రహదారుల నిర్మాణ పనులకు శ్రీకారం చుడుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నల్గొండలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన త్యాగాలను గుర్తు చేశారు. తెలంగాణ కోసం నిజమైన త్యాగాలు చేసిన వారిని ప్రజలు ఎప్పటికీ మరువరని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో తెలంగాణను రూ.8.11 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిందని ఆరోపించిన సీఎం, ప్రజా ధనాన్ని దోచుకున్న వారిని ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పాలనలపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, ప్రతిపక్షాలు స్పీకర్‌కు లేఖ రాస్తే ఎవరు ఏం చేశారో సభలోనే తేల్చుకుందామని సవాల్ విసిరారు. తమ ప్రభుత్వం లక్షలాది కొత్త రేషన్ కార్డులు జారీ చేసి, రూ.16 వేల కోట్లతో 3.28 కోట్ల మందికి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తోందని తెలిపారు. నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నామని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, బోనస్ తదితర పథకాల కోసం రూ.1.56 లక్షల కోట్లు ఖర్చు చేశామని, 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రికార్డు సృష్టించామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను అందుబాటులోకి తీసుకొస్తున్నామని, ఎస్సీ వర్గీకరణకు శాశ్వత పరిష్కారం చూపామని, 30 నెలల్లో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని సీఎం తెలిపారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేసి మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని, మూసీ ప్రక్షాళనను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల నాటికి ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తవుతాయని, 2024 నుంచి 2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం: శ్రీధర్ బాబు

**హైదరాబాద్, జూన్ 29::.**

2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉండగా, దానిని 10 శాతానికి పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. టీఎస్-ఐపాస్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0 ద్వారా పరిశ్రమలకు వేగవంతమైన అనుమతులు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ, 200 ఎకరాల్లో ఏఐ సిటీ, ప్రతి జిల్లాలో పారిశ్రామిక పార్కులు, ఎంఎస్ఎంఈలకు రూ.600 కోట్ల ప్రోత్సాహం, మహిళా పారిశ్రామికవేత్తలకు 25 శాతం స్థలాల కేటాయింపు వంటి చర్యలతో రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

# ప్రపంచ బియ్యం ఎగుమతి కేంద్రంగా తెలంగాణ: ఉత్తమ్

**హైదరాబాద్, జూన్ 29:.**




తెలంగాణను ప్రపంచ బియ్యం ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌లో కే.సి.పి న్యూట్రీ సంస్థ రూపొందించిన మల్టీ విటమిన్ రైస్ ఉత్పత్తులను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బియ్యం ఎగుమతులకు ప్రోత్సాహం, విలువ ఆధారిత ఉత్పత్తులకు మద్దతు ఇవ్వడం ద్వారా రైతుల ఆదాయం, రైస్ మిల్లర్ల లాభాలు పెంచుతామని తెలిపారు. యాసంగిలో 81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.19,303 కోట్లు జమ చేశామని చెప్పారు. రాష్ట్రంలో వార్షిక బియ్యం ఉత్పత్తి 300 లక్షల మెట్రిక్ టన్నులు దాటిందని, తెలంగాణ మిగులు బియ్యం రాష్ట్రంగా ప్రపంచ మార్కెట్లలో ప్రత్యేక గుర్తింపు సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు.

## ప్రజావాణిలో బ్యాంకర్ల ప్రత్యేక స్టాల్

### రుణాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన




**సిద్ధిపేట జూన్29:**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఐడీఓసీ కార్యాలయంలో లీడ్ బ్యాంక్ (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో బ్యాంకర్ల ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు, పేదలు, అర్హులైన ప్రజలకు వ్యవసాయ రుణాలు, ప్రభుత్వ పథకాలు, ఇతర బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన లబ్ధిదారులను అక్కడికక్కడే నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు. రైతు సంక్షేమం, గ్రామీణాభి వృద్ధికి బ్యాంకింగ్ రంగం సంపూర్ణ సహకారం అందిస్తుందని లీడ్ జిల్లా మేనేజర్ (ఎల్‌డీఎం) బి. హరిబాబు తెలిపారు.

## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్.



**మెదక్ జూన్29:.**

ఓటరు జాబితాల ఖచ్చితత్వం కోసం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ చేపట్టామని, ఓట్లు తొలగిస్తారనే అపోహలను ప్రజలు నమ్మవద్దని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఈ నెల 25 నుంచి కొనసాగుతున్న ఎన్యూమ రేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ మెదక్ మున్సిపాలిటీ గాంధీనగర్ పోలింగ్ స్టేషన్ నెం.135లో తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, డిప్యూటీ తహసీల్దార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఫారాలను ఎలా నింపాలో ఓటర్లకు స్పష్టంగా వివరించాలని, నింపిన ఫారాలను రెండు, మూడు రోజుల్లో తిరిగి బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు. గ్రామంలో రెండు రోజుల్లోనే ఫారాల పంపిణీ పూర్తి చేయాలని బీఎల్‌వోలను ఆదేశించారు. ఫారాలు అందజేసే సమయంలో ఓటర్ల సందేహాలను నివృత్తి చేసి, ఎలాంటి అపోహలకు తావులేకుండా పూర్తి వివరాలతో ఫారాలను నింపి తిరిగి సమర్పించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మూసి ప్రాజెక్ట్‌లో మానవీయ పునరావాసమే లక్ష్యం: మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, జూన్ 29::**

మూసి పునరుజ్జీవ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ, పునరావాస అంశాలపై సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, వరద నియంత్రణ, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. భూ సేకరణలో మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని, ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, భూములు కోల్పోయే వారికి చట్టబద్ధమైన పరిహారం, పూర్తి పునరావాసం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తామని మంత్రి స్పష్టం చేశారు.

## కిసాన్ సారథితో రైతులకు డిజిటల్ వ్యవసాయ సేవలు

**న్యూఢిల్లీ, జూన్ 29::**

రైతులకు ఆధునిక సాంకేతికత ఆధారిత వ్యవసాయ సేవలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కిసాన్ సారథి వేదిక దేశంలో అతిపెద్ద సమగ్ర డిజిటల్ వ్యవసాయ సలహా వేదికగా నిలిచింది. ఈ వేదిక ద్వారా రైతులకు వ్యవసాయ నిపుణుల సూచనలు, ప్రభుత్వ పథకాల సమాచారం, వాతావరణ హెచ్చరికలు, మార్కెట్ ధరలు ఒకే చోట అందుబాటులోకి వస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 2.95 కోట్ల మంది రైతులు ఈ వేదికలో నమోదు చేసుకోగా, 37 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, 768 జిల్లాలు, 6.63 లక్షల గ్రామాలకు సేవలు విస్తరించాయి. అలాగే 730కు పైగా కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవీకేలు), 100కు పైగా ఐసీఏఆర్ సంస్థలు, 65 వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఈ వేదికతో అనుసంధానమయ్యాయి. ఇప్పటివరకు రైతుల నుంచి వచ్చిన 19.21 లక్షల ప్రశ్నలకు నిపుణులు సమాధానాలు అందించగా, 351 పంటలకు సంబంధించి 21,900 వ్యవసాయ సలహాలు విడుదల చేశారు.

## జూన్ 30న గ్రామసభలపై జాతీయ అధ్యయన నివేదిక విడుదల

న్యూఢిల్లీ జూన్29:.

దేశవ్యాప్తంగా గ్రామసభల్లో ప్రజల తక్కువ భాగస్వామ్యంపై రూపొందించిన జాతీయ అధ్యయన నివేదికను జూన్ 30న న్యూఢిల్లీలో విడుదల చేయనున్నారు. 26 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని సుమారు 400 గ్రామ పంచాయతీలలో 7,790 మంది అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు అవసరమైన సూచనలు, విధాన పరమైన సిఫార్సులు ఇందులో పొందుపరిచారు.

## ఫ్రాన్స్‌తో పర్యాటక, సాంస్కృతిక బంధాల బలోపేతానికి తెలంగాణ కృషి



హైదరాబాద్ జూన్29:.

హైదరాబాద్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావును ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ, డిప్యూటీ కాన్సుల్ పాస్కల్ లోరియో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ–ఫ్రాన్స్ మధ్య పర్యాటకం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ, పెట్టుబడులు, ప్రజల మధ్య సంబంధాల విస్తరణపై చర్చించారు. తెలంగాణ పర్యాటక విశేషాలను ఫ్రెంచ్ పర్యాటకులకు చేరువ చేసేందుకు సంయుక్త కార్యాచరణ చేపట్టాలని మంత్రి ప్రతిపాదించారు. ఫ్రాన్స్ కూడా పర్యాటక, సాంస్కృతిక రంగాల్లో తెలంగాణతో మరింత సహకారానికి సిద్ధంగా ఉందని కాన్సుల్ జనరల్ తెలిపారు.

## రెండో రోజు పల్స్ పోలియో ఇంటింటి నిర్వహణ పై జిల్లా కలెక్టర్ పరిశీలన



మహబూబు నగర్ జూన్29( సమయం న్యూస్)

పాతపాలమూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పల్స్ పోలియో రోజున పోలియో చుక్కలు వేయని (X houses) ఇంట్లోని పిల్లలకు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా గుప్తా,ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని,జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు లతో కలిసి రెండవ రోజు కార్యక్రమం లో భాగంగా పోలియో చుక్కలు వేయడం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి సర్వే చేసి తి 0–5సం. ల మధ్య వయస్సు ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. శైలజ, స్టేట్ కన్సల్టెంట్ డా. మొహమ్మద్ అబ్దుల్ వస్సే, DYDMHO డా. శశికాంత్, డా. పులివిద్య, డా. మమత,DPO సీతారామ్, MPHEO సుభాష్ ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 1,064 అర్జీలు స్వీకరణ



హైదరాబాద్ జూన్,29:.

హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 1,064 దరఖాస్తులు స్వీకరించినట్లు అదనపు కలెక్టర్ కదిరవన్ పలని తెలిపారు. ప్రజలు అందజేసిన అర్జీలను శాఖల వారీగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే సీఎం ప్రజావాణి, కలెక్టరేట్ ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా త్వరగా పరిష్కరించాలని సూచించారు. మొత్తం అర్జీల్లో 2బీహెచ్‌కే గృహాలకు 927, పింఛన్లకు 101, రెవెన్యూ శాఖకు 18, ఇతర శాఖలకు 18 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి నారాయణతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జూలై 1న గైనకాలజీ స్పెషలిస్టుల ఎంపికకు వాక్-ఇన్ ఇంటర్వ్యూ

ఖమ్మం జూన్29:

ఖమ్మం జిల్లాలోని మధిర ఏరియా ఆసుపత్రి, కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో సేవలందించేందుకు ఇద్దరు గైనకాలజీ స్పెషలిస్ట్ వైద్యులను జూలై 1 ఉదయం 11 గంటలకు వాక్–ఇన్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయనున్నట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కె. రాజశేఖర్ గౌడ్ తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.1 లక్ష గౌరవ వేతనం చెల్లిస్తారు. ఎంబీబీఎస్‌తో పాటు ఎంఎస్ (ఓబీజీ) అర్హత కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, అనుభవ ధ్రువపత్రాలు, రెండు సెట్ల జిరాక్స్ ప్రతులు, రెండు ఫోటోలతో కలెక్టరేట్‌లోని జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలు, దరఖాస్తు నమూనా కోసం ఖమ్మం జిల్లా అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలని తెలిపారు.

## ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

- నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి
- రౌడీ, సస్పెక్ట్, కమ్యూనల్ షీటర్లపై నిరంతర నిఘా
- వృత్తిపై నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలి
- ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



నారాయణపేట,29:

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి ఎలాంటి భేదభావం లేకుండా పారదర్శకంగా,మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS పోలీసు అధికారులను ఆదేశించారు.వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం ఉట్కూర్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ రామ్‌లాల్, ఎస్సై రమేష్ పూలమొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి పరేడ్, యూనిఫాం టర్నౌట్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలు, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, దర్యాప్తు నాణ్యత, ప్రజలకు అందిస్తున్న సేవలు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను ఎలా స్వాగతిస్తున్నారు,ఫిర్యాదులను ఆన్లైన్‌లో ఎలా నమోదు చేస్తున్నారో ప్రత్యక్షంగా పరిశీలించారు. అలాగే CCTNS వ్యవస్థలో కేసుల నమోదు, నిర్వహణ విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, కమ్యూనల్ షీటర్లపై నిరంతర నిఘా ఉంచి విధిగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. నేర నియంత్రణ, క్రైమ్ ప్రివెన్షన్, కేసుల త్వరిత గతిన పరిష్కారం, ప్రజలతో సత్సంబంధాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... గ్రామాల్లో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించాలని తెలిపారు. ప్రతి విలేజ్ పోలీస్ ఆఫీసర్ తమకు కేటాయించిన గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతి పోలీసు సిబ్బంది నీట్ టర్నౌట్‌తో పాటు వృత్తిపై నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని పేర్కొన్నారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదపూర్వకంగా మాట్లాడి వారి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో పోలీసులపై నమ్మకం, భద్రత, భరోసా పెంపొందేలా వ్యవహరించాలని సూచించారు. డయల్–100 సేవలపై వేగంగా స్పందించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించిన ఎస్పీ, ప్రధాన రహదారులపై ప్రమాదాలు అధికంగా జరిగే హాట్‌స్పాట్లను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు.దొంగతనాల నివారణకు ముందస్తు నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని, "Prevention is Better Than Cure" విధానాన్ని అనుసరిస్తూ నేరాలు జరగక ముందే అప్రమత్త చర్యలు చేపట్టాలని సూచించారు. కాలనీలు, గ్రామాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తూ పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, దొంగతనాలు జరిగిన వెంటనే కేసులను ఛేదించాలని ఆదేశించారు.అక్రమ వ్యాపారాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ రామ్ లాల్,ఎస్సై రమేష్,SB ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజస్థాన్–హర్యానా మధ్య యమునా జలాల ప్రాజెక్టు ఒప్పందం

న్యూఢిల్లీ, జూన్ 29:.

: కేంద్ర హోంమంత్రి, సహకార శాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో రాజస్థాన్, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలు యమునా జలాల ప్రాజెక్టు నిర్మాణం, అమలుకు కీలక ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ, దాదాపు మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న నీటి సమస్యకు ఈ ఒప్పందంతో పరిష్కారం లభించిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించిన "చర్చల ద్వారా పరిష్కారం" మరియు "సహకార సమాఖ్య విధానం"కు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కింద జూలై నుంచి అక్టోబర్ వరకు యమునా కాలువ నుంచి భూగర్భ పైప్‌లైన్ల ద్వారా సుమారు 580 మిలియన్ క్యూబిక్ మీటర్ల (ఎంసీఎం) నీటిని రాజస్థాన్‌కు తరలిస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాజస్థాన్‌లోని సీకర్, చూరు, ఝున్‌ఝును జిల్లాలు, హర్యానాలోని భివానీ, ఫతేహాబాద్ ప్రాంతాలకు తాగునీరు అందనుంది. ఇప్పటివరకు వృథాగా సముద్రంలో కలిసిపోతున్న వర్షపు నీటిని వినియోగించి, చెరువుల్లో నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాల మట్టం పెంచే అవకాశం కలుగుతుందని తెలిపారు. 1994లో కుదిరిన ఎగువ యమునా జలాల పంపిణీ ఒప్పందం ప్రకారం రాజస్థాన్‌కు కేటాయించిన నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

## భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తాగునీటి ప్రాజెక్టుల రూపకల్పన చేపట్టాలి:

### జలమండలి ఎండీ అశోక్ రెడ్డి



హైదరాబాద్ జూన్29:

హైదరాబాద్ నగర విస్తరణతో పాటు క్యూర్ (CURE) ప్రాంతం వరకు పెరుగుతున్న భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న ప్రాజెక్టులను సమగ్ర ప్రణాళికతో నిర్మించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం గోదావరి ఫేజ్–2, ఫేజ్–3 ప్రాజెక్టులు, నియోపోలీస్ సమగ్ర మంచినీటి సరఫరా పనులను పరిశీలించిన ఆయన, ఖానాపూర్‌లో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. నియోపోలీస్‌లో ప్రతిపాదించిన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, పంపింగ్ స్టేషన్, డబ్ల్యూటీపీ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించిన ఎండీ, భవిష్యత్ విస్తరణకు అనుగుణంగా తగిన స్థలం కేటాయించడం, అవసరమైతే బహుళ అంతస్తుల రిజర్వాయర్ల నిర్మాణ అవకాశాలను సాంకేతికంగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రధాన పైప్‌లైన్ అనుసంధానం, గ్రావిటీ ఆధారిత నీటి సరఫరా, కనీసం ఒక రోజు అవసరానికి సరిపడే నిల్వ సామర్థ్యం, అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా ఏర్పాట్లపై సమగ్ర అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే హెచ్‌ఎండీఏ అధికారులతో కలిసి ఖానాపూర్ సమీపంలో ప్రతిపాదిత రహదారి నిర్మాణానికి అనుగుణంగా 1200 ఎంఎం వ్యాసం గల తాగునీటి పైప్‌లైన్ షిఫ్టింగ్ పనులను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్, సీజీఎం రాజశేఖర్, జీఎంలు, హెచ్‌ఎండీఏ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు, సైట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ నీ కలిసిన ఆఫీస్ సూపరింటెండెంట్

నారాయణపేట,జూన్,29:

నారాయణపేట జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో నూతన ఆఫీస్ సూపరింటెండెంట్‌గా శ్యామ్ సుందర్ రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నేడు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. శ్యామ్ సుందర్ రాజు తెలంగాణ స్పెషల్ పోలీస్ (TGSP) 10వ బెటాలియన్ నుంచి బదిలీపై నారాయణపేట జిల్లా డీపీఓ కార్యాలయానికి వచ్చారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, ఐపీఎస్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి జిల్లా పోలీసు శాఖ పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా కృషి చేయాలని సూచించారు.కాగా, ఇంతకుముందు నారాయణపేట జిల్లా డీపీఓ కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన శంకర్ లాల్ బదిలీపై తెలంగాణ స్పెషల్ పోలీస్ (TGSP) 10వ బెటాలియన్‌కు వెళ్లారు.



## బాధిత కుటుంబాలకు భరోసాగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్..



### అనారోగ్య బాధితురాలికి సాయం

మరిపెడ,జూన్29::

మరిపెడ మండలానికి చెందిన రిపోర్టర్ దాసరోజు బాలకృష్ణ సతీమణి సరిత ఇటీవల అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటికి చేరుకున్నారు.ఈ నేపథ్యంలో మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ సోమవారం వారి నివాసానికి వెళ్లి సరితను పరామర్శించారు.ఆమె ఆరోగ్య పరిస్థితినిఅడిగితెలుసుకుని,కుటుంబానికి అండగా నిలుస్తూ రూ10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం మరిపెడ పట్టణంలోని 13వ వార్డుకు చెందిన అబ్దుల్ నబి సతీమణి ఖాజాబి ఇటీవల మృతి చెందగా,వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఖాజాబి మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన మాజీ మంత్రి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతితెలియజేస్తూమనోధైర్యంగా ఉండాలని సూచించారు.

## విపత్తు నిర్వహణకు రూ.96 లక్షల రెస్క్యూ పరికరాలు

హనుమకొండ, జూన్ 29:(:.

విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేందుకు జిల్లా కొనుగోలు కమిటీ ద్వారా రూ.96 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన 59 రకాల అత్యాధునిక రెస్క్యూ, లైఫ్ సేవింగ్ పరికరాలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మామునూర్ 4వ బెటాలియన్‌లో పరిశీలించారు. నాణ్యత ధ్రువీకరణ అనంతరం వాటిని జీడబ్ల్యూఎంసీ, అగ్నిమాపక శాఖ, 4వ బెటాలియన్‌కు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఎన్‌డీఎంఏ శిక్షణ పొందిన ఆపదమిత్ర వాలంటీర్లకు ప్రత్యేక విపత్తు నిర్వహణ కిట్లను కూడా అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి,

# మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన

### ఎస్ఐఆర్ ఓటరు సవరణ ప్రక్రియను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్, జూన్ 29::.**



చిగురుమామిడి మండల కేంద్రంలో రూ.16 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవనానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, ప్రభుత్వం అందించిన స్టీల్ ప్లేట్లు, గ్లాసులను సామూహిక కార్యక్రమాల్లో వినియోగించాలని మహిళలకు సూచించారు. ఈ భవనం స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను మంత్రి పరిశీలించారు. బీఎల్‌వోలు, బీఎల్ఏలతో మాట్లాడి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, నమోదు పురోగతిపై ఆరా తీశారు. 2002, 2025 ఓటరు జాబితాలను ప్రామాణికంగా తీసుకుని అర్హులైన ప్రతి ఓటరికి ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన పత్రాలతో ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ఆర్డీఓ షర్మిల, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల బలోపేతానికి అందరూ తోడ్పడాలి

### మున్సిపల్ చైర్ పర్సన్ సన్మానిస్తున్న పిఎసిఎస్ చైర్మన్ సిబ్బంది

**ఆలేరు, జూన్ 29::**



అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో సోమవారం వారోత్సవాలను పురస్కరించుకొని సంఘ కార్యాలయం ఎదుట పీఏసీ చైర్మన్ మొగులగాని మల్లేశం సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బీజని బాలమణి భాస్కర్‌ను సంఘం తరపున శాలువాతో ఘనంగా సత్కరించారు. సహకార సంఘాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పీఏసీ చైర్మన్ మొగులగాని మల్లేశం కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంగడి ఆంజనేయులు, స్థానిక కౌన్సిలర్ బీజని కళ్యాణి మధు, సంఘ డైరెక్టర్లు కట్టేగుమ్ముల విద్యాసాగర్ రెడ్డి, అరె మల్లేశం, బీస కృష్ణంరాజు, కూల్ల సిద్ధులు, దడిగె అంజయ్య, ఎన్‌డీసీసీ బ్యాంకు మేనేజర్ ఆర్. కావ్య, సంఘ కార్యదర్శి ఐ. వెంకట్ రెడ్డి, రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## మేలో పారిశ్రామిక ఉత్పత్తి 5.1 శాతం వృద్ధి

**న్యూఢిల్లీ, జూన్ 29:**

దేశ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) 2026 మే నెలలో 5.1 శాతం వృద్ధి నమోదు చేసింది. తయారీ రంగం 5.5 శాతం, విద్యుత్–గ్యాస్ సరఫరా రంగం 9.9 శాతం వృద్ధితో ప్రధాన పాత్ర పోషించాయి. మైనింగ్ రంగం మాత్రం 1.6 శాతం క్షీణించింది. ఐఐపీ కొత్త సిరీస్‌లో డబ్ల్యూపీఐ స్థానంలో అవుట్‌పుట్ పీపీఐని డిఫ్లేటర్‌గా ఉపయోగించాలని గణాంకాల మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. దీనితో 463 ఐటెం గ్రూపులలో 234 గ్రూపులు ప్రభావితమవుతాయి. మే నెలలో సాధారణ సూచీ 122.7గా నమోదైంది. వినియోగ ఆధారిత విభాగాల్లో క్యాపిటల్ గూడ్స్ 12.9 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 7.2 శాతం వృద్ధి సాధించాయి. జూన్ 2026 ఐఐపీ వివరాలు జూలై 28న విడుదల కానున్నాయి.

## గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల విద్యార్థి బన్నీకి కలెక్టర్ సన్మానం

**కామారెడ్డి జూన్29 :**



కామారెడ్డి పట్టణంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల విద్యార్థి ఇస్లావత్ బన్నీ లడఖ్‌లోని 6,100 మీటర్ల ఎత్తైన కైగర్ రి (Kaigar Ri) పర్వతాన్ని విజయవంతంగా అధిరోహించి జిల్లాకు గర్వకారణంగా నిలిచాడు. బన్నీ జూన్ 14న పర్వతారోహణను ప్రారంభించి, జూన్ 19 ఉదయం 8 గంటలకు శిఖరాన్ని చేరుకున్నాడు. శిఖరంపై భారత జాతీయ త్రివర్ణ పతాకంతో పాటు తెలంగాణ గిరిజన సంక్షేమ విద్యాసంస్థల సొసైటీ (TTWREIS) కళాశాల ఫ్లెక్సీని ప్రదర్శించి దేశభక్తిని, తన విద్యాసంస్థపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నాడు. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఎల్లాపూర్ తండాకు చెందిన బన్నీ గతంలో కిలిమంజారో, కాంగ్ యత్సే పర్వతాలను కూడా అధిరోహించి తన ప్రతిభను నిరూపించుకున్నాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన బన్నీ ఈ ఘనత సాధించడం పట్ల అతని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బన్నీని శాలువాతో సన్మానించి అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ, బన్నీ సాధించిన విజయం కళాశాలతో పాటు జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని శిఖరాలను అధిరోహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అతని విజయాలు యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. శ్రీనివాస స్వామి పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి, కామారెడ్డి జిల్లా వారి చే జారీ చేయబడినది.

## బాలల సంరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: ఎస్పీ రోహిత్ రాజు

**కొత్తగూడెం, జూన్ 29::.**



జిల్లాలో జులై 1 నుంచి 31 వరకు నిర్వహించనున్న ఆపరేషన్ ముస్కాన్–12 విజయవంతానికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సూచించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆపరేషన్ ముస్కాన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, తప్పిపోయిన పిల్లలు, భిక్షాటనకు గురవుతున్న చిన్నారులు, నిరాశ్రయ బాలలు, బాల కార్మికులను గుర్తించి రక్షించి కుటుంబాలకు చేర్చడమే ఆపరేషన్ ముస్కాన్ ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లాలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 18 ఏళ్లలోపు పిల్లలను హింసించడం, భిక్షాటన చేయించడం, బాల కార్మికులుగా వినియోగించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖలు, బాలల సంక్షేమ విభాగాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో కలిసి పాఠాలు విన్న కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ఎల్లారెడ్డి పేట జూన్29:**

ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థులతో కలిసి కూర్చొని బోధనను పరిశీలించి, ప్రశ్నలు అడిగి వారి అభ్యాసాన్ని పరీక్షించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, మెనూ అమలు, ఆహార నాణ్యత, వసతులపై ఆరా తీశారు. ప్రణాళికాబద్ధంగా చదివి ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకోవాలని, లైబ్రరీలో పుస్తకాలతో పాటు దినపత్రికలు కూడా చదవాలని విద్యార్థులకు సూచించారు.

# గురుకుల సమస్యలను పరిష్కరించాలి

**ఆలేరు, జూన్ 29:):**



ఆలేరు పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల బాలుర వసతి గృహంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ ఉదయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హాస్టల్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు నివసించే ఈ వసతి గృహంలో కనీస మౌలిక వసతులు కూడా లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు పూర్తిగా అపరిశుభ్రంగా మారాయని, దుర్వాసన, నిల్వ నీరు, మురికి కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బంది లేకపోవడంతో శుభ్రత పూర్తిగా దెబ్బతిన్నదని, దీంతో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, చర్మవ్యాధులు, జీర్ణ సంబంధిత వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గురుకుల విద్యను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని విమర్శించారు. ప్రచారానికి భారీగా ఖర్చు చేస్తున్న ప్రభుత్వం హాస్టళ్ల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించడంలో విఫలమైందన్నారు. ప్రతి హాస్టల్‌లో శాశ్వత పారిశుద్ధ్య కార్మికులను నియమించి రోజువారీ శుభ్రత నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హాస్టల్‌లోని మరుగుదొడ్లను వెంటనే శుభ్రం చేయడంతో పాటు పరిసరాల్లో బ్లీచింగ్, ఫాగింగ్ నిర్వహించాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, గురుకుల విద్యాసంస్థల అధికారులు స్వయంగా హాస్టల్‌ను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, సమస్యలు పరిష్కరించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళనలు, ధర్నాలు, ముట్టడి కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## కొడంగల్ మున్సిపల్ కార్యాలయంలో పొలియే చుక్కల కార్యక్రమం

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చెర్మెన్ నందారం ప్రశాంత్
- వైద్యాధికారి బుష్రా ఫాతిమా ఆధ్వర్యంలో



**కొడంగల్ మున్సిపల్,జూన్,29:**

వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణ కేంద్రంలో పల్స్ పొలియే సందర్భంగా కొడంగల్ మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కొడంగల్ ఎస్సై జి.వి సత్యనారాయణ తో కలిసి పల్స్ పొలియే కార్యక్రమములో భాగంగా 5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమం 28, 29, 30, తేదీలలో జరుగుతుంది ఆదివారం బూతు లో రేపటి నుండి ఇల్లులు తిరిగి పోలియో చుక్కలు వేయడం జరుగుతుంది ఆదివారం 94% పిల్లలు చుక్కలు వేయించుకోవడం జరిగింది. మన మండలం లో మొత్తం 33 బూతులు ఒక ట్రాన్సిస్ట్ పాయింట్ బస్ స్టాండు లో ఒక మొబైల్ బూతు ఉంది. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్. బుష్రా ఫాతిమా,డాక్టర్.అమృత,ఏ.ఎన్.ఎం చంద్రకళ హెల్త్ అసిస్టెంట్ మధుసూదన్ రెడ్డి,రేణుక ఆశ పాల్గొనడం జరిగింది.

## కల్లూరులో డీసీసీబీ నూతన భవనం ప్రారంభం

### మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు.



**కల్లూరు జూన్29:.**

ఖమ్మం జిల్లా కల్లూరులో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) నూతన శాఖ భవనాన్ని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి ప్రారంభించారు. రైతుల అభ్యున్నతే సహకార బ్యాంకుల ప్రగతికి పునాదని మంత్రి పేర్కొన్నారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లిస్తే బ్యాంకింగ్ వ్యవస్థ మరింత బలోపేతమవుతుందన్నారు. కల్లూరులో ఇంటిగ్రేటెడ్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు కోసం ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. సాగునీరు, తాగునీరు, రహదారులు, విద్యాసంస్థలు, పరిపాలనా మౌలిక వసతుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. వేంసూరులో పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ఖమ్మం–అశ్వారావుపేట రహదారిని నాలుగు లైన్ల జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కేంద్రాన్ని కోరినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, డీసీసీబీ ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు లభిస్తున్నాయని, రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలని సూచించారు.

## గిరిజన నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

**ఖమ్మం, జూన్ 29::.**

ఐటీడీఏ భద్రాచలం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా గిరిజన నిరుద్యోగ యువతకు 3–4 నెలల ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎన్. విజయలక్ష్మి తెలిపారు. వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, బ్యూటీషియన్, గెస్ట్ సర్వీస్ అసోసియేట్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో శిక్షణ అందించనున్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, స్టడీ మెటీరియల్‌తో పాటు కోర్సు పూర్తయ్యాక సర్టిఫికెట్ అందజేస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, కుల ధృవీకరణ పత్రం, విద్యార్హతల ధ్రువపత్రాలు, ఫోటోలతో జూలై 1 ఉదయం 9 గంటలకు రోటరీ నగర్‌లోని ఐటీడీఏ స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 6305802724ను సంప్రదించాలని తెలిపారు.

## ఓటరు జాబితా సవరణలో పొరపాట్లకు తావివ్వొద్దు: కలెక్టర్ అంకిత్

**ములకలపల్లి, జూన్ 29::**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ములకలపల్లి మండలంలో పర్యటించిన ఆయన, బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఫారాలు పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరికి ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి దరఖాస్తును ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పరిశీలించి అర్హుల పేర్లు జాబితాలో ఉండేలా చూడాలని తెలిపారు. ప్రజలు కూడా తమ వివరాలను పరిశీలించి అవసరమైన ఫారాలను గడువులోపు సమర్పించాలని కోరారు. అనంతరం ములకలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, వైద్య సేవలు, పరిశుభ్రత, మందుల నిల్వలు, రోగులకు అందుతున్న చికిత్సను పరిశీలించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల నివారణకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన మందులు, పరీక్షా కిట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణ, పరిశుభ్రత, దోమల నియంత్రణ, సురక్షిత తాగునీటి వినియోగంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

## బీసీ, ఈబీసీ విద్యార్థులు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలి

**నిజమాబాద్ జూన్29:.**



నిజామాబాద్ జిల్లాలో 2026–27 విద్యా సంవత్సరానికి 9వ, 10వ తరగతులు చదువుతున్న బీసీ, ఈబీసీ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ప్రీ–మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాయి కుమార్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న అర్హులైన విద్యార్థులు తెలంగాణ ఈ–పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ.4,000 ప్రీ–మెట్రిక్ స్కాలర్‌షిప్ అందజేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారుల కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలలోపు ఉండాలి. ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, బ్యాంకు పాస్‌బుక్ కాపీ, బోనాఫైడ్ సర్టిఫికెట్‌తో సమీపంలోని మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## మత్తు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**జగిత్యాల జూన్29:**

జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన "నషా ముక్త్ భారత్" కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని మంత్రి పిలుపునిచ్చారు. జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం అవసరమని, ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు, డీ–అడిక్షన్ సేవల ద్వారా మత్తు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తోందని తెలిపారు.

## డీఎస్పీలుగా పదోన్నతి పొందిన 36 మంది అధికారులకు పోస్టింగ్‌లు



**హైదరాబాద్, జూన్ 29:.**

తెలంగాణ పోలీసు శాఖలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల నుంచి డీఎస్పీలుగా పదోన్నతి పొందిన 36 మంది అధికారులకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, యూనిట్లలో పోస్టింగ్‌లు కల్పించారు. ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, పదోన్నతి బాధ్యతలను మరింత పెంచుతుందని, అధికారులు నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో ప్రజలకు సేవ చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరిస్తూ శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, బాధితులకు సత్వర న్యాయం అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పదోన్నతి పొందిన అధికారులకు లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలు కాకుండా ఇతర పోలీసు విభాగాల్లో పోస్టింగ్‌లు కేటాయించారు.

## ప్రజావాణికి 23 ఫిర్యాదులు

- ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి
- అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక



**నారాయణపేట,జూన్,29:**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 23 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, డి.ఆర్.ఓ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటి కప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో,డి.ఆర్.ఓ.రాజేశ్వరి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు..

## జిల్లాలో 43 శాతం ఇన్యూమరేషన్ ఫారాలు అందజేయడం జరిగింది

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

**వికారాబాద్, జూన్,29:**




జిల్లాలో 43 శాతం ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. సోమవారం సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, పూరించే విధానం, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, విస్తృత ప్రచారం తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ఉన్నత స్థాయి అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్యూమరేషన్ ఫారాలు ప్రతి ఇంటికి చేరే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బిఎల్ఓ లు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.ఎన్యూమరేషన్ ఫారాలపైన ఫోటోలు, సంతకం కచ్చితంగా ఉండేలా బిఎల్ఓ లకు సూచించాలన్నారు.సహాయ ఎన్నికల అధికారులు, సూపర్ వైజర్లు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించాలని ఆయన సూచించారు.ప్రతి ఇంటిని బిఎల్ఓలు సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలు అందించడం జరుగుతుందని ప్రధాన ఎన్నికల అధికారికి జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు.బిఎల్ ఓ లు తప్పనిసరిగా గుర్తింపు కార్డు, టోపీలు ధరించి ఎన్యూమరేషన్ ఫారాలుర పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో 2 బిఎల్ఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రధాన ఎన్నికల అధికారి దృష్టికి తీసుకువెళ్లారు.సహాయ ఎన్నికల అధికారులు, సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో ఎన్యూమరేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి ఇంటికి ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలు 100 శాతం వెనక్కి వచ్చే విధంగా, ఈ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి స్వర్ణలత, రెవెన్యూ డివిజనల్ అధికారి వాసు చంద్ర, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేమత్ అలి, తహసిల్దార్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

### కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, జూన్ 29:.**



భారీ వర్షాలు, ఆకస్మిక వరదల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లోతట్టు ప్రాంతాలు, ప్రాజెక్టుల పరివాహక ప్రాంతాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. కుంగిన రహదారులు, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, ప్రాజెక్టుల గేట్లు ఎత్తే ముందు ప్రజలకు సమాచారం అందించడం, గర్భిణులు, తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు, విద్యుత్ వ్యవస్థ దెబ్బతిన్నా వెంటనే పునరుద్ధరణ చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, ప్రాజెక్టులు, ప్రమాదకర చెరువుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసు బందోబస్తు కల్పిస్తామని, వరదల సమయంలో అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు.

## టీఆర్ఎల్ కంపాస్ వేదిక ప్రారంభం

### డీఎస్‌సీఐతో అవగాహన ఒప్పందం

**న్యూఢిల్లీ, జూన్ 29:.**

దేశంలో పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణల అంచనాలకు ఏకీకృత ప్రమాణాలను తీసుకురావడంలో భాగంగా భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయం టీఆర్ఎల్ (టెక్నాలజీ రెడీనెస్ లెవల్) కంపాస్ వేదికను సోమవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (డీఎస్‌సీఐ)తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ వేదిక ద్వారా ప్రభుత్వ నిధుల కోసం దరఖాస్తు చేసే పరిశోధన, సాంకేతిక ప్రాజెక్టుల పరిపక్వతను అంతర్జాతీయంగా అమలులో ఉన్న తొమ్మిది స్థాయిల టీఆర్ఎల్ ప్రమాణాల ఆధారంగా నిష్పాక్షికంగా అంచనా వేయనున్నారు. ఆరోగ్య, ఔషధ, సాఫ్ట్‌వేర్ రంగాలకు ప్రత్యేక మూల్యాంకన విధానాలను కూడా ఇందులో చేర్చారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రీయ సలహాదారు ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్ మాట్లాడుతూ, వికసిత్ భారత్–2047 లక్ష్య సాధనలో పరిశోధనలను వాణిజ్యపరంగా ఉపయోగపడే సాంకేతికతలుగా మార్చేందుకు టీఆర్ఎల్ కంపాస్ కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ వేదికను పరిశోధకులు, సమీక్షకులు, నిధుల సంస్థలు ఉచితంగా వినియోగించుకోవచ్చని వెల్లడించారు.

## అభివృద్ధి చెందిన గ్రామాలే వికసిత భారతానికి పునాది

**న్యూఢిల్లీ, జూన్ 29:**

అభివృద్ధి చెందిన గ్రామాల ద్వారానే వికసిత భారత లక్ష్యం సాకారమవుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. జాతీయ గ్రామీణ వికాస సమ్మేళనంలో 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల గ్రామీణాభివృద్ధి మంత్రులతో సమావేశమైన ఆయన, జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా 'వికసిత్ భారత్—వీబీ–గ్రామ్–జీ' పథకాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత కోసం 'లఖ్‌పతి దీదీ డ్యాష్‌బోర్డ్', 'షీ లీప్స్' డిజిటల్ వేదికలను ప్రారంభించారు. వచ్చే ఐదేళ్లలో స్వయం సహాయక సంఘాలకు రూ.10 లక్షల కోట్ల బ్యాంకు రుణాల అనుసంధానం లక్ష్యంగా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ప్రతి అర్హ కుటుంబానికి గ్రామీణ గృహం అందిస్తామని, రాష్ట్రాలు తమ వాటా నిధులను సకాలంలో విడుదల చేయడంతో పాటు ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. పథకాల అమలులో పారదర్శకత కోసం కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని పెంచాలని, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్రాలకు పిలుపునిచ్చారు.

## జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ

**జగిత్యాల, జూన్ 29:.**

ప్రభుత్వం—ప్రజల మధ్య వారధిగా మీడియా కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 2026–28 కాలానికి జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్ కార్డులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్థంభమని, ప్రజల సమస్యలను ప్రభుత్వానికి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల సేవలు ప్రశంసనీయమని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా సహకారం అభినందనీయమన్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ బాధ్యతాయుతమైన, వాస్తవాధారిత వార్తలను అందించాలని సూచించారు. వి. శ్రీధర్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## హరీష్‌రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్ జూన్29:.**

బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు అసెంబ్లీ రద్దు చేయాలన్న వ్యాఖ్యలపై రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రంగా స్పందించారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఐదేళ్ల పాలనకు తీర్పు ఇచ్చారని, రెండున్నరేళ్లకే అసెంబ్లీని రద్దు చేసే ప్రశ్నే లేదన్నారు. ప్రతి ఎన్నికలో బీఆర్ఎస్‌కు ప్రజలు శిక్ష విధిస్తున్నారని వ్యాఖ్యానించారు. బీజేపీ అధికారంపై అత్యాశతో ఉందని, బీఆర్ఎస్—బీజేపీ ఒకే తాను ముక్కలని విమర్శించారు. రైతు భరోసా నిధులను వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని, క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 18 నియోజక వర్గాల్లో 23 స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసే ఆలోచన లేదని, భూముల ధరల నిర్ణయంలో పొరపాట్లు ఉంటే సరిదిద్దు తామని మంత్రి చెప్పారు.

## ఉద్యోగాలపై సీఎం అసత్యాలు చెబుతున్నారు

### డాక్టర్ కె. వాసుదేవరెడ్డి

**హైదరాబాద్, జూన్ 29::**




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్నారని మాజీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కె. వాసుదేవరెడ్డి ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, బీఆర్ఎస్ నేత వినోద్ కుమార్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండలో ముఖ్యమంత్రి ఉద్యోగ నియామకాలపై మరోసారి అసత్యాలు చెప్పారని విమర్శించారు. ప్రభుత్వం 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని సీఎం చెబుతున్నారని, అయితే అసెంబ్లీలో ప్రభుత్వం ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో 16,978 ప్రభుత్వ ఉద్యోగాలే భర్తీ చేసినట్లు పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. అసెంబ్లీలో చెప్పిన గణాంకాలే సరైనవా, లేక ఇప్పుడు చెబుతున్న లెక్కలే నిజమా అని ప్రశ్నించారు. నిరుద్యోగుల ఆత్మగౌరవాన్ని ప్రభుత్వం దెబ్బతీసిందని, ముఖ్యమంత్రి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. కట్టుకథలు, పిట్టకథలు చెప్పడం మానేసి పాలనపై దృష్టి పెట్టాలని అన్నారు. రాహుల్ గాంధీ రాజకీయాల కోసం నిరుద్యోగులను పావులుగా ఉపయోగించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి, మంత్రులు అశోక్‌నగర్ లైబ్రరీ, దిల్‌సుఖ్‌నగర్, సిటీ లైబ్రరీ, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కార్యాలయాల వద్దకు వెళ్లి నిరుద్యోగులతో మాట్లాడే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. నిరుద్యోగుల్లో పెరుగుతున్న అసంతృప్తిని ఇంటెలిజెన్స్ శాఖ ముఖ్యమంత్రికి తెలియజేయడం లేదా అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క పోలీస్ ఉద్యోగానికీ నోటిఫికేషన్ ఇవ్వలేదని విమర్శించారు. డీజీపీ 19 వేల పోలీస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెబుతుంటే కేవలం 5 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం సరైంది కాదన్నారు. కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు పెంచాలని, నిరుద్యోగులపై నమోదైన కేసులను ఎత్తివేయాలని, కనీసం 20 వేల ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలని, జీఓ 46ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా ప్రభుత్వం సుమారు 30 లక్షల నిరుద్యోగులను నిరాశలోకి నెట్టిందని ఆరోపించారు. జాబ్ క్యాలెండర్‌ను "జాబ్‌లెస్ క్యాలెండర్"గా మార్చిందని విమర్శించారు. నిరుద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేకపోతే వారు తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈరోజు కూడా పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కార్యాలయం ఎదుట నిరుద్యోగులు ధర్నా నిర్వహించారని తెలిపారు.




# వెండితెరపై మౌన ప్రేమకు శాశ్వత రూపం

## 73 వసంతాల క్లాసిక్ 'దేవదాసు'!

### 1953 జూన్ 26న విడుదలై తెలుగు చలనచిత్ర చరిత్రలో అజరామర మైలురాయిగా నిలిచిన చిత్రం

తెలుగు చలనచిత్ర పరిశ్రమ గర్వించదగ్గ మైలురాళ్లలో, వెండితెరపై మౌన ప్రేమకు శాశ్వత రూపంగా నిలిచిన 'దేవదాసు' చిత్రం విడుదలై విజయవంతంగా 73 వసంతాలు పూర్తి చేసుకుందని సీనియర్ స్వతంత్ర జర్నలిస్ట్, కాలమిస్ట్ రామ కిష్టయ్య సంగన భట్ల ఒక ప్రత్యేక కథనంలో కొనియాడారు. 1953 జూన్ 26న విడుదలైన ఈ చిత్రం కేవలం ఒక సాధారణ ప్రేమ కథ మాత్రమే కాదు, అదొక తాత్విక అక్షరగాథ, మానసిక సంఘర్షణ మరియు సామాజిక ఒత్తిడుల మధ్య నలిగిపోయిన ప్రేమకు సజీవ సాక్ష్యం. శరత్ చంద్ర ఛటర్జీ 1901లో రచించి, 1917లో ప్రచురించిన కాలాతీత బెంగాలీ నవల 'దేవదాస్' ఆధారంగా రూపొందిన ఈ చిత్రం, ప్రేమలో విఫలమైన ఒక యువకుడి ఆత్మవేదనను, నిరాశను, త్యాగాన్ని మరియు జీవిత నిరుద్దేశాన్ని వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించింది. ప్రేమని పొందలేకపోయిన మనిషి విలాపాన్ని ఒక అద్భుతమైన కళారూపంగా మలిచి, తెలుగు సినిమా చరిత్రలో ఇదొక తాత్విక చిత్రంగా చిరస్థాయిగా నిలిచిపోయింది.

ఈ చిత్రంలో నటసమ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు అసాధారణ నటన చిత్రానికే ప్రాణంగా నిలిచింది. దేవదాసు పాత్రలో ఆయన పలికించిన హావభావాలు, ప్రేమలో ఓడిపోయిన పురుషుడి మౌనాన్ని, బాధను మరియు పతనాన్ని కళ్లకు కట్టాయి. ఆఖరి శ్వాస వరకు పార్వతిని మరువలేకపోయిన ఒక ప్రేమికుడి త్యాగాన్ని, ఆత్మవేదనను తన ప్రతి చూపుతో అక్కినేని అమరత్వానికి చేర్చారు. ఇక మహానటి సావిత్రి పార్వతిగా చేసిన అభినయం, వేదనతో కూడిన ప్రేమను ఎలా అణిచివేయాలో చూపిన ఒక మౌన పోరాటంలా సాగింది. ఆమె ముఖ కవళికలు, కన్నీటి ఆరని ఛాయలు ప్రేక్షక హృదయాలను నేటికీ ద్రవింపజేస్తాయి. చంద్రముఖిగా లలిత నటన ప్రేమకు గౌరవం ఇచ్చే వేశ్య మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తూ, చిత్రంలో మానవతా స్నేహాన్ని చాటిచెప్పగా, సి.ఎస్.ఆర్ మరియు ఎస్.వి. రంగారావు వంటి దిగ్గజాలు తమ పాత్రల్లో లీనమై చిత్రానికి మరింత జీవం పోశారు.

ఈ చిత్ర విజయానికి సంగీతం మరొక ప్రధాన బలమని, అది శోకానికి శబ్ద రూపం లాంటిదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సంగీత దర్శకుడు సి.ఆర్. సుబ్బురామన్ స్వరాలు, విశ్వనాథన్--రామమూర్తిల అనుబంధం మరియు గానగంధర్వుడు ఘంటసాల గాత్రం ఈ చిత్రాన్ని భావ ప్రకంపనల పరాకాష్టగా తీర్చిదిద్దాయి. చిత్రంలోని 'జగమే మాయ బ్రతుకే మాయ', 'అంతా భ్రాంతియేనా జీవితానా వెలుగింతేనా', 'ఓ దేవదా చదువు ఇదేనా', 'కల ఇదని నిజమిదని తెలియదులే', 'కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్', 'చెలియ లేదు చెలిమి లేదు', మరియు 'పల్లెకు పోదాం పారుని చూదాం' వంటి గీతాలు కాల గమనంలో ఎన్నటికీ చెరిపివేయలేని అమర జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. నవలలోని లోతైన వ్యక్తీకరణను తెరపైకి తీసుకురావడంలో దర్శకుడు వేదాంతం రాఘవయ్య చూపిన ప్రతిభ, సముద్రాల రాఘవాచార్య రాసిన తాత్విక సంభాషణలు చిత్రానికి సరికొత్త గంభీరత్వాన్ని తెచ్చిపెట్టాయి.

ఈ చిత్రం ద్వారా ప్రేమలో పరాజయం అనేది కేవలం ఒక పతనంగా కాకుండా, ఒక నిగూఢ తాత్విక ఆవిష్కరణగా ప్రజ్ఞాపూరితంగా చెప్పబడింది. దేవదాసు పాత్ర కేవలం ఒక అపరాధ భావనతో బాధపడే వ్యక్తి కాదు, అతడు ప్రేమలో స్వార్థ రహితంగా తన్ను తాను త్యాగం చేసుకున్న ఒక తాత్విక జీవి. అతడి మౌనం, మద్యం సేవనం, చివరి క్షణాల వేదన అన్నీ మానవ జీవితంలోని సామాజిక లోపాలను ప్రశ్నిస్తాయి. ఈ చిత్రం విడుదలైన వెంటనే అప్పటి పత్రికలు "తెలుగు సినిమా భావ సామర్థ్యానికి కొత్త నిర్వచనం"గా దీనిని కీర్తించాయి. తదుపరి కాలంలో వివిధ భాషల్లో ఎన్నో పునర్నిర్మాణాలు (రీమేక్స్) వచ్చినప్పటికీ, 1953 నాటి ఈ తెలుగు దేవదాసు సాధించిన కళాత్మక, తాత్విక స్థాయిని ఏదీ అందుకోలేకపోయింది. కేవలం సినిమాగానే కాక సామాజిక ఒత్తిడుల మధ్య నలిగిన ఒక తరం మానసిక చిత్రంగా, శోకానికి గాత్ర రూపంగా మరియు ప్రేమలో నిబద్ధతకు నిదర్శనంగా 'దేవదాసు' వెండితెరపై నిశ్శబ్ద సత్యంగా వెలుగొందుతోంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు పార్లమెంటు

**నేడు అంతర్జాతీయ పార్లమెంటరీ దినోత్సవం**




ప్రపంచ రాజకీయ చరిత్రలో అత్యంత విలువైనదిగా పరిగణించబడుతున్న ప్రజాస్వామ్య వ్యవస్థకు పార్లమెంటులే అసలైన హృదయ స్పందనలని సీనియర్ స్వతంత్ర జర్నలిస్ట్, కాలమిస్ట్ రామ కిష్టయ్య సంగన భట్ల ఒక ప్రత్యేక కథనంలో విశ్లేషించారు. ప్రజల ప్రత్యక్ష, పరోక్ష ప్రాతినిధ్యంతో నిర్మితమయ్యే పాలనను, వారి ఆకాంక్షలను దేశ అత్యున్నత వేదికలపై వినిపించేందుకు పార్లమెంటులు కీలక సాధనాలుగా రూపుదిద్దుకున్నాయి. ప్రజాస్వామ్య మూలాల పరిరక్షణ, పారదర్శక పాలన, బాధ్యతాయుతమైన యంత్రాంగం కోసం ప్రపంచ దేశాలు అనుసరిస్తున్న పార్లమెంటరీ విధానం ఓ సుదీర్ఘ సాంప్రదాయంగా మారింది. ఈ వ్యవస్థ యొక్క ప్రాధాన్యతను, ప్రాముఖ్యతను గుర్తించి గౌరవించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 30న అంతర్జాతీయ పార్లమెంటరీ దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చట్టసభల పాత్ర, ప్రజల భాగస్వామ్యం, ఎదురవుతున్న ఆధునిక సవాళ్లపై ప్రపంచవ్యాప్తంగా విస్తృత సమీక్షలు, చర్చలు జరుగుతాయి.




ఈ చారిత్రాత్మక దినోత్సవానికి మూలాలు గమనిస్తే, 1889వ సంవత్సరంలో స్థాపించబడిన ప్రతిష్టాత్మక 'ఇంటర్ పార్లమెంటరీ యూనియన్' ద్వారా దీనికి పునాది పడింది. ప్రపంచంలోని వివిధ దేశాల శాసనసభల మధ్య పరస్పర సంబంధాలను పటిష్టం చేయడానికి, చర్చా సంస్కృతిని ప్రోత్సహించడానికి, ప్రజాస్వామ్య విలువలను వ్యాప్తి చేయడానికి జెనీవా కేంద్రంగా ఈ సంఘం ఏర్పాటయింది. ప్రారంభంలో కేవలం భావపూర్వక ప్రయత్నంగా కనిపించిన ఈ సంస్థ, కాలక్రమేణా ప్రపంచ స్థాయి గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలోనే గత 2018లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ అధికారికంగా తీర్మానం చేస్తూ, ప్రతి ఏటా జూన్ 30వ తేదీని అంతర్జాతీయ పార్లమెంటరీ దినంగా ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా అంతర్జాతీయంగా పార్లమెంటరీ వ్యవస్థల పాత్రకు, ప్రజాస్వామ్య బలోపేతానికి చట్టసభలు చేస్తున్న కృషికి అపారమైన గౌరవం దక్కింది.

ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల భౌగోళిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా పార్లమెంటరీ వ్యవస్థలు విభిన్న రూపాల్లో కొలువుదీరాయి. కొన్ని దేశాల్లో రెండు సభల విధానం అమల్లో ఉండగా, ఉదాహరణకు భారతదేశంలో లోకసభ మరియు రాజ్యసభలు సమిష్టిగా పార్లమెంటుగా వ్యవహరించబడతాయి. అలాగే అమెరికా సంయుక్త రాష్ట్రాలలో హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్, సెనేట్ అనే రెండు సభలు ఉన్నాయి. మరోవైపు నార్వే, బంగ్లాదేశ్ వంటి కొన్ని దేశాల్లో కేవలం ఒకే ఒక సభతో కూడిన పార్లమెంటు వ్యవస్థ (యూని క్యామెరల్) విజయవంతంగా నడుస్తోంది. ఏ రూపంలో ఉన్నప్పటికీ, ఈ పార్లమెంటు వ్యవస్థలు నిరంతరం ప్రజల గళంగా మారి, వారి నైతిక హక్కులను, అవసరాలను, క్షేత్రస్థాయి సమస్యలను చట్టబద్ధంగా ప్రభుత్వాల దృష్టికి చేరవేసే బాధ్యతాయుత వేదికలుగా పనిచేస్తున్నాయని విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు.


ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశానికి దక్కిన అంతర్జాతీయ కీర్తి ప్రతిష్టలు మన దేశ పార్లమెంటు వ్యవస్థ వల్లే సాధ్యమయ్యాయి. భారత పార్లమెంటు ప్రధానంగా మూడు అత్యున్నత భాగాలతో నిర్మితమైంది. అందులో దేశ ప్రథమ పౌరుడైన రాష్ట్రపతితో పాటు లోకసభ, రాజ్యసభలు అంతర్భాగంగా ఉంటాయి. నిత్యం దేశ పురోగతికి ఉపయోగపడే నూతన చట్టాల రూపకల్పన, వార్షిక బడ్జెట్ ఆమోదం, పాలకులు చేపడుతున్న వివిధ ప్రజా సంక్షేమ విధానాల సమీక్షలన్నీ పార్లమెంటు వేదికల పైనే జరుగుతాయి. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో వాతావరణ మార్పులు, ఆర్థిక అసమానతలు, అంతర్జాతీయ వలసల సమస్యలు, సాంకేతిక విప్లవం మరియు సామాజిక విభేదాలు వంటి ఎన్నో సరికొత్త సవాళ్లు దేశాలను వేధిస్తున్నాయి. ఈ క్లిష్టమైన సవాళ్లకు సమగ్రంగా స్పందించి, చర్చలు మరియు సంప్రదింపుల ద్వారా సామరస్యాన్ని సాధించగల ఏకైక ప్రజాస్వామ్య వేదిక పార్లమెంటేనని విశ్లేషించారు.

ప్రస్తుత మారుతున్న సామాజిక పరిస్థితుల్లో పార్లమెంటు వ్యవస్థలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దడం ఎంతైనా అవసరమని జర్నలిస్ట్ రామ కిష్టయ్య సంగన భట్ల అభిప్రాయపడ్డారు. చట్టసభలపై ప్రజల నమ్మకాన్ని మరింత బలపరిచే విధంగా సంస్కరణలు చేపట్టాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా సమాచార హక్కు చట్టం, డిజిటల్ పార్లమెంటు విధానం మరియు సభా కార్యకలాపాల ప్రత్యక్ష ప్రసారాల ద్వారా ప్రజలకు పార్లమెంటు పనితీరును నేరుగా చూపించడం మంచి పరిణామాలన్నారు. యువత, మహిళలు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య స్వరూపానికి మరింత విశాలత వస్తుందని పేర్కొన్నారు. జూన్ 30 అంతర్జాతీయ పార్లమెంటరీ దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్త పార్లమెంట్లు ఆత్మవిమర్శ చేసుకోవాలని, తాము నిజంగా ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేస్తున్నామా అనే ప్రశ్నలకు సమాధానంగా సరికొత్త కార్యాచరణను రూపొందించుకోవడమే ఈ దినోత్సవం యొక్క అసలైన సందేశమని ఆయన స్పష్టం చేశారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# భారత జాతీయవాద పితామహుడు దాదాభాయ్ నౌరోజీ!

## నేడు 'గ్రాండ్ ఓల్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియా' వర్ధంతి



**భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో మహాత్మా గాంధీ, బాలగంగాధర తిలక్, గోఖలే, నెహ్రూ వంటి నాయకుల పేర్లు తరచుగా వినిపిస్తాయి. కానీ వారందరికీ ముందుగానే భారత జాతీయ చైతన్యానికి బీజం వేసిన మహానుభావుడు దాదాభాయి నౌరోజీ. ఆయనను భారతీయులు ప్రేమతో "గ్రాండ్ ఓల్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియా" అని పిలిచారు. దేశ సంపదను బ్రిటిష్ పాలకులు ఎలా దోచుకుంటున్నారో ప్రపంచానికి శాస్త్రీయంగా వివరించిన తొలి భారతీయ ఆర్థికవేత్త కూడా ఆయనే.**

భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో, భారత జాతీయ కాంగ్రెస్ ఉద్భవంలో అత్యంత ప్రాతఃస్మరణీయుడైన నాయకుడు, 'గ్రాండ్ ఓల్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియా' దాదాభాయ్ నౌరోజీ వర్ధంతి (జూన్ 30)ని పురస్కరించుకుని సీనియర్ స్వతంత్ర జర్నలిస్ట్, కాలమిస్ట్ రామ కిష్టయ్య సంగన భట్ల ఒక ప్రత్యేక కథనంలో ఆయన సేవలను స్మరించుకున్నారు. 19వ శతాబ్దంలోనే భారత జాతీయవాదానికి బలమైన పునాదులు వేసిన నౌరోజీ జీవితం, దేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రను స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. కాంగ్రెస్ పార్టీ స్థాపనకు ముందే దేశ స్వేచ్ఛ కోసం గళమెత్తిన ఆయన, ఎ.ఓ. హ్యూమ్ మరియు దిన్షా ఎదుల్జీ వాచాతో కలిసి భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనలో అగ్రగామిగా నిలిచారు. జాతీయ కాంగ్రెస్ వార్షిక మహాసభలకు మూడు పర్యాయాలు అధ్యక్షత వహించిన ఘనత సాధించడంతో పాటు, బ్రిటన్ చట్టసభ అయిన యునైటెడ్ కింగ్‌డమ్ 'హౌస్ ఆఫ్ కామన్స్'కు ఎన్నికైన మొట్టమొదటి ఆసియా వ్యక్తిగా సరికొత్త చరిత్ర సృష్టించారు.

దాదాభాయ్ నౌరోజీ 1825 సెప్టెంబరు 4న బొంబాయిలోని నవసారిలో ఒక సాంప్రదాయ పార్సీ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి పలన్ జీదోరోజి జొరాస్ట్రియన్ మత పురోహితులు. బరోడా మహారాజు మూడవ శాయాజీరావు గైక్వాడ్ ఆర్థిక సహాయంతో బొంబాయిలోని ఎలిఫెన్‌స్టోన్ ఇన్స్టిట్యూట్‌లో ఉన్నత విద్యను అభ్యసించిన నౌరోజీ, తదనంతరం అదే ప్రతిష్టాత్మక కళాశాలలో ఆచార్య (ప్రొఫెసర్) పదవిని పొందారు. మహిళా విద్యా విస్తరణకు ప్రత్యేక తరగతులు నిర్వహించడమే కాకుండా, తన సొంత జొరాస్ట్రియన్ మతంలో ప్రగతిశీల సంస్కరణల కోసం ఆయన ఎంతో శ్రమించారు. నౌరోజీ ఆలోచనా విధానం అంతా ప్రధానంగా ఆర్థికశాస్త్ర సూత్రాలపైనే ఆధారపడి సాగింది. వ్యాపార రంగంలో భాగంగా 'కామా ఱ కో' సంస్థలో భాగస్వామిగా 1855లో లండన్ వెళ్లిన ఆయన, బ్రిటన్ గడ్డపై ఒక భారతీయ సంస్థను స్థాపించడంలో మార్గదర్శకుడిగా నిలిచారు. ఆ తర్వాత బ్రిటన్ లిబరల్ పార్టీలో చేరిన నౌరోజీ, అనంతరం సొంతంగా 'దాదాభాయ్ నౌరోజీ ఱ కో' వాణిజ్య సంస్థను ప్రారంభించారు. ఇంగ్లండ్‌లో ఒక భారతీయుడు నెలకొల్పిన తొలి వాణిజ్య సంస్థగా ఇది రికార్డుకెక్కింది.

రాజకీయ, సామాజిక రంగాల్లో రాణిస్తూనే 1865 నుండి 1866 వరకు లండన్ విశ్వవిద్యాలయ కళాశాలలో గుజరాతీ భాషా ఉపాధ్యాయుడిగా సేవలు అందించారు. అదే సమయంలో ఇంగ్లాండ్ ఓటర్లకు భారతీయ సమస్యలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో 'లండన్ ఇండియన్ సొసైటీ'ని, అలాగే బ్రిటిష్ వారి ముందు భారతీయుల గళాన్ని బలోపేతం చేయడానికి 'ఈస్ట్ ఇండియా అసోసియేషన్'ను ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. ప్రజా జీవితంలో క్రియాశీలకంగా ఉంటూ 1875లో బొంబాయి మునిసిపల్ కార్పొరేషన్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అనంతరం 1886లో మొదటిసారి బ్రిటిష్ పార్లమెంట్‌కు పోటీ చేసి ఓడిపోయినప్పటికీ, అధైర్యపడకుండా 1892లో రెండో ప్రయత్నంలో ఘనవిజయం సాధించి హౌస్ ఆఫ్ కామన్స్ సభ్యుడయ్యారు. 1892 నుండి 1895 వరకు ఎంపీగా కొనసాగిన కాలంలో, బ్రిటిష్ పార్లమెంట్ వేదికగా భారత ఉపఖండంలో జరుగుతున్న వలసరాజ్యాల క్రూర దోపిడీని, ఆర్థిక వివక్షను మొదటగా ఎండగట్టింది ఆయనే కావడం గమనార్హం. ఈ క్రమంలోనే 1895లో భారత వ్యయంపై ఏర్పాటైన రాయల్ కమిషన్ సభ్యుడిగా కూడా నియమితులయ్యారు.

రాజ్యాంగబద్ధ పాలనపై ఉన్న పట్టుతో బరోడా సంస్థాన మహారాజు శయాజీ రావు గైక్వాడ్ కాలంలో ఆ సంస్థాన దివానుగా (ప్రధాన మంత్రిగా) బాధ్యతలు నిర్వహించిన నౌరోజీ, 1885 నుండి 1888 వరకు ముంబై శాసనమండలి సభ్యుడిగా కూడా సేవలందించారు. భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపకులలో ఒకరిగా సురేంద్రనాథ్ బెనర్జీతో కలిసి పనిచేస్తూ, 1886లో మొదటిసారి కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1893లో లాహోర్ మహాసభలకు, 1906లో కలకత్తాలో జరిగిన చారిత్రాత్మక కాంగ్రెస్ సభలకు అధ్యక్షత వహించి, మూడు సార్లు కాంగ్రెస్ అధ్యక్ష పదవిని అధిరోహించిన తొలి భారతీయ మహానాయకుడిగా కీర్తించబడ్డారు. దాదాభాయ్ నౌరోజీ మేధోశక్తికి నిదర్శనంగా పలు అమూల్యమైన గ్రంథాలను రచించారు. ఆయన రాసిన "పావర్టీ అండ్ అన్-బ్రిటిష్ రూల్ ఇన్ ఇండియా" (భారతదేశంలో పేదరికం - బ్రిటిష్ రహిత నియమం) అనే గ్రంథం, భారతదేశ సంపదను బ్రిటన్ ఏ విధంగా తరలిస్తోందో (డ్రెయిన్ థియరీ) గణాంకాలతో వివరించిన తొలి ప్రామాణిక పుస్తకంగా నిలిచింది. వీటితో పాటు పార్సీల ఆచారాలు, యూరోపియన్-ఆసియా జాతులు వంటి అంశాలపై ఎన్నో పరిశోధనాత్మక రచనలు చేసిన నౌరోజీ 1917 జూన్ 30న కన్నుమూశారు. బ్రిటీష్ సామ్రాజ్యవాద కేంద్రంలోనే నిలబడి భారతీయుల హక్కుల కోసం పోరాడిన ఈ నిజమైన జాతీయవాది త్యాగాలను ప్రతి ఒక్క భారతీయుడు స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

చురకలు





## తగ్గిన బంగారం, వెండి

**హైదరాబాద్, జూన్ 29 :** బంగారం ధరలు సోమవారం స్వల్పంగా తగ్గాయి. ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,020గా నమోదైంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,31,100గా ఉంది. వెండి ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించలేదు. తెలంగాణలో హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,020గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,31,100గా నమోదైంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,07,270గా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతిలో కూడా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,020, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,31,100, 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,07,270గా నమోదైంది. దేశంలోని ప్రధాన నగరాల్లో చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,090, 22 క్యారెట్ల ధర రూ.1,33,000గా ఉంది. న్యూఢిల్లీలో 24 క్యారెట్ల ధర రూ.1,43,170, 22 క్యారెట్ల ధర రూ.1,31,250గా నమోదైంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు, కేరళలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,020గా ఉండగా, అహ్మదాబాద్‌లో రూ.1,43,070గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డాలర్ మారకం విలువ, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలను బట్టి రానున్న రోజుల్లో బంగారం ధరల్లో మరింత హెచ్చుతగ్గులు నమోదయ్యే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

AEROMART
HYDERABAD - INDIA

## ఏరోమార్ట్ సదస్సుకు హైదరాబాద్ సిద్ధం

**హైదరాబాద్, జూన్ 29 :** తెలంగాణ రాజధాని హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనుంది. జూన్ 30 నుంచి జూలై 2 వరకు మూడు రోజుల పాటు 'ఏరోమార్ట్ హైదరాబాద్--2026' సదస్సు జరగనుంది. తెలంగాణ ప్రభుత్వం, బీసీఐ ఏరోస్పేస్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా విమానయానం, రక్షణ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు పాల్గొననున్నాయి. ఈ కార్యక్రమానికి 25 దేశాల నుంచి 400కుపైగా అంతర్జాతీయ సంస్థలు, రక్షణ రంగ నిపుణులు హాజరవుతున్నారు. దాదాపు 1,200 మంది ప్రతినిధులు పాల్గొని ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో వస్తున్న సాంకేతిక మార్పులు, ఆవిష్కరణలు, పరిశ్రమల అభివృద్ధిపై చర్చించనున్నారు. ఈ సదస్సు తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించడంలో కీలకంగా మారనుందని అధికారులు భావిస్తున్నారు. స్థానిక పరిశ్రమలు విదేశీ సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పరుచుకునేందుకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు ఇది మంచి అవకాశంగా నిలవనుంది. సదస్సు ద్వారా రాష్ట్రంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరిగే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో కొత్త పరిశ్రమలు, స్టార్టప్‌లు ఏర్పడి యువతకు పెద్దఎత్తున నైపుణ్యాధారిత ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. భారత్ రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యానికి ఈ సదస్సు మరింత బలాన్ని చేకూర్చనుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## స్థిరంగా పెట్రోల్, డీజిల్ ధరలు

**హైదరాబాద్, జూన్ 29 :** దేశీయ చమురు సంస్థలు మంగళవారం పెట్రోల్, డీజిల్ ధరలను యథాతథంగా కొనసాగించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, డాలర్‌తో రూపాయి మారకం విలువ, రవాణా వ్యయాలు, రాష్ట్రాల పన్నులను పరిగణనలోకి తీసుకుని ప్రతిరోజూ ఉదయం ఇంధన ధరలను ప్రకటిస్తుంటాయి. తెలంగాణలో గత కొన్ని రోజులుగా ఇంధన ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.69గా, డీజిల్ ధర రూ.103.82గా కొనసాగుతోంది. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం తదితర నగరాల్లో స్థానిక పన్నుల కారణంగా స్వల్ప తేడాలు ఉన్నప్పటికీ ధరలు దాదాపు స్థిరంగానే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇంధన ధరలు మారలేదు. విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.117.51గా, డీజిల్ ధర రూ.105.20గా కొనసాగుతోంది. విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు తదితర ప్రాంతాల్లో కూడా స్వల్ప వ్యత్యాసాలతో ఇదే స్థాయిలో ధరలు నమోదవుతున్నాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల్లో పెద్దగా మార్పులు లేకపోవడంతో దేశీయ మార్కెట్‌లో కూడా పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయని చమురు రంగ నిపుణులు పేర్కొంటున్నారు.




# సామాన్యుడి జేబుకు కత్తెర

## జూలై 1 నుంచి మారనున్న పలు కీలక నిబంధనలు!

### జూలై మొదటి తేదీ నుంచి దేశవ్యాప్తంగా బ్యాంకింగ్, పన్నులు, పాస్‌పోర్ట్ రంగాల్లో కొత్త రూల్స్

### 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఐటీఆర్ (Xు=) దాఖలు చేయడానికి జూలై 31 ఆఖరి గడువు




**న్యూఢిల్లీ, జూన్ 29:** దేశవ్యాప్తంగా సామాన్య ప్రజల దైనందిన ఆర్థిక లావాదేవీలు మరియు ప్రభుత్వ సేవలపై ప్రభావం చూపించే పలు కీలక మార్పులు జూలై 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. బ్యాంకింగ్, పన్నుల విధానం, ఆధార్ సేవలు, పాస్‌పోర్ట్ దరఖాస్తులు మరియు క్రెడిట్ కార్డుల వినియోగానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పలు కొత్త నిబంధనలను తీసుకువచ్చాయి. ఈ కొత్త నిబంధనల వల్ల పన్ను చెల్లింపుదారులతో పాటు నిత్యం డిజిటల్ లావాదేవీలు నిర్వహించే సామాన్యుల బడ్జెట్‌పై ప్రత్యక్ష ప్రభావం పడనుంది. ఈ మార్పుల నేపథ్యంలో ప్రజలంతా ముందస్తుగా అప్రమత్తం కావాలని ఆర్థిక రంగ నిపుణులు సూచిస్తున్నారు. ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరపు ఐటీఆర్ (ఆదాయపు పన్ను రిటర్నులు) దాఖలు చేయడానికి జూలై 31వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. ఐటీఆర్-1, ఐటీఆర్-2 ఫారాల ద్వారా పన్నులు చెల్లించే ప్రతి ఒక్కరికీ ఈ గడువు వర్తిస్తుంది. నిర్ణీత సమయం దాటిన తర్వాత రిటర్నులు దాఖలు చేస్తే భారీ జరిమానాలు చెల్లించాల్సి రావడంతో పాటు చట్టప్రకారం లభించే కొన్ని పన్ను రాయితీలను కూడా శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు, ఆధార్ వినియోగదారులకు యుఐడిఎఐ ఒక ఊరటనిచ్చే ప్రకటన చేసింది. ఆధార్ కార్డులో నమోదు చేసుకున్న వ్యక్తిగత ఈ-మెయిల్ చిరునామాను ఇకపై ఉచితంగా మార్చుకునే సువర్ణావకాశాన్ని కల్పించారు. ఆధార్ మొబైల్ అధికారిక అనువర్తనం (యాప్) ద్వారా ఈ సేవలను ఎలాంటి అదనపు రుసుము లేకుండా 2026 డిసెంబర్ 31వ తేదీ వరకు ఉచితంగా పొందేందుకు గడువు విధించారు. బ్యాంకింగ్ రంగంలో క్రెడిట్ కార్డుల వినియోగదారులకు జూలై 1 నుంచి కొత్త షరతులు వర్తించనున్నాయి. ఫోన్‌పే-ఎస్‌బీఐ ఉమ్మడి క్రెడిట్ కార్డుల రివార్డు పాయింట్ల విధానంలో బ్యాంక్ కీలక మార్పులు చేసింది. నిర్దేశిత ఖర్చు పరిమితిని దాటిన తర్వాత మాత్రమే పాయింట్లు లభిస్తాయని, కొన్ని రకాల లావాదేవీలపై ఇకపై ఎలాంటి రివార్డు పాయింట్లు ఇవ్వబోమని స్పష్టం చేసింది. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ (ఎఱఖీజ) బ్యాంక్ సైతం తన క్రెడిట్ కార్డు వినియోగదారులకు ఎయిర్‌పోర్ట్ లాంజ్ సదుపాయంలో కోత విధించింది. ఒక త్రైమాసికంలో మూడు ఉచిత విమానాశ్రయ లాంజ్ ప్రవేశాలు పొందాలంటే, అంతకుముందు త్రైమాసికంలో సదరు కార్డుపై కనీసం రూ.60 వేల వరకు ఖర్చు చేసి ఉండాలనే కఠిన నిబంధనను తీసుకువచ్చింది. దీనికి తోడు విదేశాలకు వెళ్లే ప్రయాణికులకు దరఖాస్తుల భారం పెరగనుంది. జూలై 1వ తేదీ నుంచి దేశీయంగా మరియు విదేశాల్లో దరఖాస్తు చేసుకునే వారందరికీ సాధారణ, తక్షణ (తత్కాల్) పాస్‌పోర్ట్ ఫీజులను భారీగా పెంచుతున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. కాగా, కస్టమర్ల ప్రయోజనాలను కాపాడేందుకు భారతీయ రిజర్వు బ్యాంకు (=దీ×) ఒక విప్లవాత్మక నిర్ణయాన్ని తీసుకువచ్చింది. ఖాతాదారుల ఆర్థిక అవసరాలు మరియు అంగీకారంతో సంబంధం లేకుండా, టార్గెట్ల పేరుతో బ్యాంకులు బలవంతంగా అంటగడుతున్న వివిధ రకాల బీమా పాలసీలు, పెట్టుబడి పథకాల విక్రయాలకు (మిస్-సెల్లింగ్) అడ్డుకట్ట వేసేలా కొత్త కఠిన మార్గదర్శకాలను ఆర్‌బీఐ అమల్లోకి తెస్తోంది. వినియోగదారుల హక్కులను రక్షించడమే ఈ నిర్ణయాల ముఖ్య ఉద్దేశమని బ్యాంకింగ్ అధికారులు స్పష్టం చేశారు.

# ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గులు

### ఇంధన ధరలపై ప్రభావం

**హైదరాబాద్, జూన్ 29 :** అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావంతో ముడి చమురు మార్కెట్‌లో తీవ్ర హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయి. హార్ముజ్ జలసంధి సమీపంలో ఖతార్‌కు చెందిన ముడి చమురు రవాణా నౌకపై జరిగిన దాడి, అనంతరం ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా చేపట్టిన చర్యలతో ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అయితే పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ఇరు దేశాలు దాడులను నిలిపివేసి దోహాలో చర్చలకు అంగీకరించడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో కొంత ఊరట కనిపించింది. దీంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 73.39 డాలర్లకు చేరుకున్నప్పటికీ, అనంతరం స్వల్పంగా తగ్గింది. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల సమీపంలో కొనసాగుతోంది. హార్ముజ్ జలసంధి మీదుగా నౌకాయానం కొనసాగుతున్నప్పటికీ, పర్షియన్ గల్ఫ్‌లో వందలాది నౌకలు నిలిచిపోవడంతో కొన్ని చమురు ట్యాంకర్లు తమ ప్రయాణాలను తాత్కాలికంగా నిలిపివేశాయి. దీంతో ప్రపంచ చమురు సరఫరాపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో దేశీయంగా కూడా ఇంధన ధరలు పెరిగాయి. అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతలు ప్రారంభమైనప్పటి నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగు దఫాల్లో పెరిగి లీటరుకు సుమారు రూ.7.50 నుంచి రూ.8 వరకు అదనపు భారం పడింది. ప్రస్తుతం ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.102.12, డీజిల్ ధర రూ.95.20గా ఉంది. హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.115.73, డీజిల్ రూ.103.82గా నమోదైంది. కోల్‌కతాలో పెట్రోల్ రూ.113.51, డీజిల్ రూ.99.82గా ఉండగా, ముంబైలో పెట్రోల్ రూ.111.21, డీజిల్ రూ.97.83గా ఉన్నాయి. బెంగళూరులో పెట్రోల్ రూ.110.89, డీజిల్ రూ.98.80గా ఉండగా, చెన్నైలో పెట్రోల్ రూ.108.01, డీజిల్ రూ.99.66గా విక్రయిస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు, ముడి చమురు సరఫరా, దౌత్యపరమైన పరిణామాలపై ఆధారపడి రానున్న రోజుల్లో ఇంధన ధరల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.







## గ్యాస్ వినియోగదారులకు కీలక గడువు

**న్యూఢిల్లీ, జూన్ 29 :** దేశవ్యాప్తంగా ఎల్‌పీజీ గ్యాస్ వినియోగదారులకు జూలై 1 నుంచి కొన్ని కీలక నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ముఖ్యంగా పైప్‌లైన్ గ్యాస్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో నివసించే వారు, ఇంకా ఈ-కేవైసీ పూర్తి చేయని వినియోగదారులు కొత్త మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఇప్పటికే ఇంట్లో పైప్‌లైన్ గ్యాస్ కనెక్షన్ ఉండి, అదనంగా ఎల్‌పీజీ కనెక్షన్ వినియోగిస్తున్న వారు నిర్ణీత గడువులోగా ఎల్‌పీజీ కనెక్షన్‌ను సరెండర్ చేయాల్సి ఉంటుంది. ఒకే ఇంట్లో రెండు గ్యాస్ కనెక్షన్లకు అనుమతి ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. స్వచ్ఛందంగా ఎల్‌పీజీ కనెక్షన్‌ను సరెండర్ చేసిన వారికి ప్రత్యేక కూపన్ అందజేస్తారు. భవిష్యత్తులో అవసరమైతే అదే కూపన్‌తో తిరిగి కనెక్షన్ పొందే అవకాశం ఉంటుంది. పైప్‌లైన్ గ్యాస్ సదుపాయం ఉన్న ప్రాంతాల్లో ఎల్‌పీజీ వినియోగదారులు నిర్ణయించిన గడువులోగా పీఎన్‌జీ కనెక్షన్‌కు మారాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. మార్చిలో ప్రకటించిన మూడు నెలల గడువు జూన్ నెలాఖరుతో ముగియనుండటంతో, మారని వారి కనెక్షన్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఎల్‌పీజీ వినియోగదారులందరికీ ఈ-కేవైసీ పూర్తి చేయడం తప్పనిసరి. జూన్ 30లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయని వారికి జూలై 1 నుంచి గ్యాస్ సేవలు లేదా సిలిండర్ బుకింగ్‌లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఈ-కేవైసీ పూర్తి చేసిన వారికి ఈ నిబంధన వర్తించదు. ప్రస్తుతం నగరాల్లో ఒక సిలిండర్ బుక్ చేసిన తర్వాత మరో సిలిండర్ బుక్ చేసేందుకు 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల విరామం కొనసాగుతోంది. అయితే పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకుంటున్న నేపథ్యంలో ఈ గడువును తగ్గించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీనిపై త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

## బలహీనంగా లిస్ట్ అయిన ఐపీఓ..

**హైదరాబాద్, జూన్ 29 :** ఇటీవల స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన ఓ ఫిన్‌టెక్ కంపెనీ షేర్లు అంచనాలకు తగ్గట్టుగా రాణించకపోవడంతో పెట్టుబడిదారులు నిరాశ చెందారు. జూన్ 29న జాతీయ, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఈ కంపెనీ షేర్లు ఐపీఓ ధరతో పోలిస్తే సుమారు 11 శాతం తగ్గుదలతో ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. రూ.883 కోట్ల విలువైన ఈ ఐపీఓను ఒక్కో షేరుకు రూ.144 నుంచి రూ.152 ధరల మధ్య అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే లిస్టింగ్ రోజే షేర్లు తగ్గుదలతో ప్రారంభం కావడంతో పెట్టుబడిదారుల్లో ఆందోళన వ్యక్తమైంది. కంపెనీ ఆర్థిక పరిస్థితి, ప్రతికూల రాబడి నిష్పత్తి వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను క్లౌడ్ మౌలిక సదుపాయాల విస్తరణ, సాంకేతిక బృందం బలోపేతం, మార్కెటింగ్, వ్యాపార విస్తరణకు వినియోగించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. లక్షలాది బీమా సలహాదారుల ద్వారా కోట్ల సంఖ్యలో పాలసీలు విక్రయించినప్పటికీ ఆదాయంలో గణనీయమైన తగ్గుదల నమోదవడం పెట్టుబడిదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. కంపెనీ వ్యయాల్లో అధిక భాగం డిజిటల్ భాగస్వామ్య ఖర్చులకే వెళ్తుండటంతో సమీప భవిష్యత్తులో లాభదాయకత సాధించడం సవాలుగా మారే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అందువల్ల స్వల్పకాలిక పెట్టుబడిదారులు ఈ షేర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. దీర్ఘకాలిక పెట్టుబడులపై దృష్టి పెట్టే వారు మాత్రమే కంపెనీ వ్యాపార అవకాశాలు, ఆర్థిక పనితీరు, మార్కెట్ పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకోవడం మంచిదని మార్కెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు. ఇప్పటికే ఈ షేర్లలో పెట్టుబడి పెట్టిన వారు తగిన రిస్క్ నిర్వహణతో ముందుకు సాగాలని, కొత్త పెట్టుబడిదారులు మాత్రం ధరలు స్థిరపడే వరకు వేచి ఉండటం ఉత్తమమని పేర్కొంటున్నారు.



# హైదరాబాద్ హీరోస్‌కు రగ్బీ కిరీటం

- ఆర్‌పీఎల్ సీజన్-2లో ముంబైపై ఘన విజయం
- 41-17తో చిత్తు..
- సీఎం చేతుల మీదుగా ట్రోఫీ



**హైదరాబాద్, జూన్ 29:** హెచ్‌ఎస్‌బీసీ రగ్బీ ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) రెండో సీజన్‌లో హైదరాబాద్ హీరోస్ చరిత్ర సృష్టించింది. గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్లో ముంబై డ్రీమర్స్‌ను 41-17తో చిత్తుగా ఓడించి ఛాంపియన్‌గా అవతరించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజేత జట్టుకు ట్రోఫీని అందజేశారు. జీఎంఆర్ స్పోర్ట్స్, రగ్బీ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన ఈ టోర్నీలో ప్రపంచస్థాయి ఆటగాళ్లు,




మహిళల లీగ్, భారీ ప్రేక్షకాదరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఫైనల్‌ను వీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి ఆటగాళ్లను అభినందిస్తూ, హైదరాబాద్‌ను అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఇలాంటి పోటీలు కీలకమని పేర్కొన్నారు. మ్యాచ్‌లో హైదరాబాద్ హీరోస్ అన్ని విభాగాల్లో ఆధిపత్యం చెలాయించింది. ఫ్రాన్సిస్కో కాస్కుల్లోలా, తైతైఫోనో తావితా, శివమ్ శుక్లా, మాన్యుయెల్ మోరెనో, మారిస్ లాంగ్, డీగో అర్డావో, కెవిన్ వెకేసా, టెరియో తమాని అద్భుత ప్రదర్శనతో జట్టుకు విజయాన్ని అందించారు. ముంబై తరపున ఇథన్ మెక్‌ఫార్లాండ్, జేమ్స్ టర్నర్, సుకుమార్ హెంబ్రోమ్ పోరాడినా ఫలితం లేకపోయింది. ఈ విజయంతో హైదరాబాద్ హీరోస్ రూ.45 లక్షల ప్రైజ్ మనీని సొంతం చేసుకోగా, రన్నరప్ ముంబై డ్రీమర్స్‌కు రూ.25 లక్షలు, మూడో స్థానం సాధించిన బెంగళూరు బ్రేవ్‌హార్ట్స్‌కు రూ.15 లక్షలు లభించాయి. మూడో స్థానం కోసం జరిగిన పోరులో బెంగళూరు 22-19తో చెన్నై బుల్స్‌ను ఓడించింది. ముగింపు వేడుకలకు మెగాస్టార్ చిరంజీవి, ఒలింపియన్ పీవీ సింధు, నటి మృణాళ్ ఠాకూర్, జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్ కుమార్ గ్రాంధి తదితరులు హాజరయ్యారు. ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి కూడా పాల్గొన్నారు. రగ్బీ ఇండియా అధ్యక్షుడు రాహుల్ బోస్ మాట్లాడుతూ.. గత సీజన్‌తో పోలిస్తే ఈసారి లీగ్ అన్ని విధాలా విజయవంతమైందని, ప్రపంచస్థాయి ఆటగాళ్లు, మహిళల లీగ్, అభిమానుల ఆదరణతో భారత రగ్బీ కొత్త దశలోకి అడుగుపెట్టిందన్నారు. జీఎంఆర్ స్పోర్ట్స్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సుజోయ్ గంగూలీ మాట్లాడుతూ యువ ప్రతిభను వెలికితీసి రగ్బీ అభివృద్ధికి ఈ లీగ్ కీలక వేదికగా నిలిచిందన్నారు. హైదరాబాద్ హీరోస్ విజయం తెలంగాణ క్రీడాభిమానులకు గర్వకారణంగా నిలవగా, రగ్బీ ప్రీమియర్ లీగ్ భారత క్రీడా రంగంలో మరో మైలురాయిగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## హెచ్ కోచ్ పదవికి హెన్రీచ్ రాజీనామా



టీ20 సిరీస్‌లో భారత్‌ను క్లీన్ స్వీప్ చేసి చరిత్రాత్మకమైన విజయం సాధించిన కొద్ది గంటల్లోనే ఐర్లాండ్ క్రికెట్ జట్టులో భారీ మార్పులు జరిగాయి. ఆ జట్టు హెచ్ కోచ్ హెన్రీచ్ మలాన్ కోచ్ పదవికి రాజీనామా చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ రాజీనామా తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. అయితే ఈ నిర్ణయానికి గల కారణాలు మాత్రం తెలియాల్సి ఉంది. ఏదేమైనా భారత్?లాంటి బలమైన జట్టును 2-0తో క్లీన్ స్వీప్ చేసిన అనంతరం హెడ్ కోచ్ తన పదవికి రాజీనామా చేయడం మాత్రం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, రీసెంట్‌గా భారత్ శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో ఐర్లాండ్ పర్యటనకు వెళ్లింది. ఈ టూర్‌లో రెండు మ్యాచ్ టీ20 సిరీస్ ఆడింది. అయితే పసికూన ఐర్లాండ్ జట్టు తమ సొంతగడ్డపై వరల్డ్ ఛాంపియన్స్ భారత్?ను వరుసగా రెండు టీ20 మ్యాచ్‌ల్లోనూ ఓడించి సరికొత్త చరిత్ర సృష్టించింది. క్రికెట్‌లో ఫార్మాట్‌లోనైనా భారత్‌పై ఐర్లాండ్‌కు ఇదే తొలి సిరీస్ విజయం కావడం విశేషం. ఈ సిరీస్?లో శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 34 పరుగులు తేడాతో ఓడిపోయింది. ఇక ఆదివారం జరిగిన రెండో టీ20లో ఒక్క పరుగు స్వల్ప తేడాతో పరాజయం పాలైంది.

## నేమార్ భారీ విరాళం




బ్రెజిల్ ఫుట్‌బాల్ సంచలనం నేమార్ వెనిజులాలో సంభవించిన అత్యవసర రెస్క్యూ, మానవతా సహాయక చర్యల కోసం ఏకంగా 2,50,000 యూఎస్ డాలర్ల భారీ విరాళం ఇచ్చాడు. ఈ నిధులను భూకంప బాధితులకు తక్షణమే అవసరమైన ఫుడ్, తాగునీరు, మెడికల్ సప్లైస్, తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేయడానికి ఉపయోగించనున్నారు. "నా హృదయం వెనిజులా ప్రజల కోసమే తపిస్తోంది" అని నేమార్ ఎమోషనల్ అయ్యాడు. తన వంతుగా ఇచ్చిన ఈ సాయం దారుణంగా దెబ్బతిన్న ఎన్నో కుటుంబాలకు ధైర్యాన్ని, ఉపశమనాన్ని ఇస్తుందని ఆశిస్తున్నట్లు నేమార్ చెప్పాడు. వెనిజులా నేషనల్ అసెంబ్లీ ప్రెసిడెంట్ జార్జ్ రోడ్రిగ్జ్ అక్కడ జరిగిన నష్టాన్ని వివరించాడు.

# ఉత్కంఠ పోరులో కెనడా రికార్డు విజయం





ఫిఫా ప్రపంచకప్ 2026 నాకౌట్ పోరులో కెనడా చరిత్ర సృష్టించింది. ఆదివారం జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో కెనడా 1-0 గోల్స్ తేడాతో సౌతాఫ్రికాను ఓడించి, ప్రపంచకప్‌లో మొట్టమొదటిసారిగా 'రౌండ్ ఆఫ్ 16'లోకి దూసుకెళ్లింది. మ్యాచ్ చివరి నిమిషంలో కెనడా మిడ్‌ఫీల్డర్ స్టీఫెన్ యూస్టాకియో కొట్టిన గోల్ ఆ జట్టుకు చారిత్రాత్మక విజయాన్ని అందించింది. మ్యాచ్ ప్రారంభం నుంచే ఇరు జట్లు గోల్ కోసం హోరాహోరీగా తలపడ్డాయి. తొలి అర్ధభాగంలో సౌతాఫ్రికా జట్టు అటాకింగ్ గేమ్ ఆడుతూ కెనడా డిఫెన్స్‌ను పరీక్షించింది. అయితే, ఫైనల్ పాస్‌లు సరిగ్గా అందకపోవడంతో వారు గోల్ చేసే సువర్ణ అవకాశాలను చేజార్చుకున్నారు. మరోవైపు ఫస్ట్ హాఫ్ ముగిసే సమయానికి కెనడాకు వరుసగా రెండు గోల్స్ చేసే అవకాశాలు వచ్చాయి. కానీ, సౌతాఫ్రికా గోల్‌కీపర్ రోన్వెన్ విలియమ్స్ అద్భుతంగా సేవ్ చేశాడు. రెండో అర్ధభాగంలో కెనడా ఆటపై పూర్తి నియంత్రణ సాధించింది. మ్యాచ్ 75వ నిమిషంలో కెనడా స్టార్ ప్లేయర్ అల్ఫోన్సో డేవిస్ మైదానంలోకి అడుగుపెట్టడంతో జట్టులో సరికొత్త ఉత్సాహం వచ్చింది. డేవిస్ రాకతో కెనడా అటాకింగ్ వేగవంతం చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసి ఎక్స్‌ట్రా టైమ్‌కు వెళ్తుందని అభిమానులు భావిస్తున్న తరుణంలో, 92వ నిమిషంలో నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. సౌతాఫ్రికా డిఫెండర్లు బంతిని క్లియర్ చేయడంలో చేసిన చిన్న పొరపాటును యూస్టాకియో అద్భుతంగా వాడుకున్నాడు. బాక్స్ అంచున తనకు దొరికిన బౌన్సింగ్ బాల్‌ను గోల్ పోస్ట్ లెఫ్ట్ కార్నర్‌లోకి పంపాడు. సౌతాఫ్రికా కీపర్ ఎంత ప్రయత్నించినా ఆ బంతిని ఆపలేకపోయాడు. ఈ ఏకైక గోల్‌తో కెనడా విజయం ఖరారైంది. మరోవైపు, ఈ ఓటమితో దక్షిణాఫ్రికా జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించినప్పటికీ, తమ ఫుట్‌బాల్ చరిత్రలోనే మొదటిసారి ప్రపంచకప్ నాకౌట్ దశకు చేరుకుని గర్వంగానే వెనుదిరిగింది. అమెరికా, కెనడా, మెక్సికో దేశాల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న 'ఫిఫా ప్రపంచకప్ 2026' సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. శనివారంతో ముగిసిన టోర్నీ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లను వీక్షించేందుకు ప్రపంచవ్యాప్తంగా రికార్డు స్థాయిలో అభిమానులు తరలివచ్చారు. కేవలం గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లకే రికార్డు స్థాయిలో 46 లక్షలకు పైగా మంది అభిమానులు స్టేడియాలకు హాజరైనట్లు అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య అధికారికంగా ప్రకటించింది. ఫుట్‌బాల్ చరిత్రలోనే ఇదివరకు ఎన్నడూ లేనంత మంది ప్రేక్షకులు ఈ లీగ్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించారని ఫిఫా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించింది. ఫిఫా ప్రపంచకప్ 2026 సాధిస్తున్న అపూర్వ విజయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. ఫుట్‌బాల్ చరిత్రలోనే ఈ స్థాయి ఆదరణ మునుపెన్నడూ చూడలేదని ఆయన కొనియాడారు. ఈ మేరకు ఆయన తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. 'ప్రస్తుత ఫిఫా ప్రపంచకప్ గణాంకాలు చరిత్రలోని ఏ ఇతర ప్రపంచకప్ కంటే చాలా ఎక్కువగా ఉన్నాయి. ఇది యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాకు దక్కిన గొప్ప గౌరవం. ఈ టోర్నీ విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని ట్రంప్ పేర్కొన్నారు. గ్రూప్ స్టేజ్‌లోనే 4.6 మిలియన్ల మంది ప్రేక్షకులను ఆకర్షించిన ఈ మెగా టోర్నమెంట్, ఇప్పుడు నాకౌట్ దశకు చేరుకోవడంతో ఫుట్‌బాల్ అభిమానులలో ఉత్కంఠ మరింత పెరిగింది. రాబోయే రౌండ్ ఆఫ్ 16, క్వార్టర్ ఫైనల్స్, సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లకు హాజరు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఖాయంగా కనిపిస్తోంది. ఫిఫా ప్రపంచకప్ 2026 రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో కెనడా చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించడంపై సౌతాఫ్రికా జట్టు ప్రధాన కోచ్ హ్యూగో బ్రూస్ భావోద్వేగంగా స్పందించారు. మ్యాచ్ ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తీవ్ర నిరాశలో ఉన్నప్పుడు భవిష్యత్తుపై ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోలేనని, రాబోయే రోజుల్లో ఆలోచించుకుని తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని స్పష్టం చేశారు. అయితే, కోచ్‌గా ఇదే తన చివరి ప్రపంచకప్ కాబోతోందని ఆయన బలంగా హింట్ ఇచ్చారు. 2021లో సౌతాఫ్రికా జట్టు కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన హ్యూగో బ్రూస్, ఆ జట్టును అత్యంత క్రమశిక్షణ, గట్టి పోటీనిచ్చే బలమైన జట్టుగా తీర్చిదిద్దారు. 2010లో ఆతిథ్య దేశంగా ఆడిన తర్వాత మళ్లీ ప్రపంచకప్‌నకు అర్హత సాధించలేకపోయిన సౌతాఫ్రికాను, 16 ఏళ్ల తర్వాత మళ్లీ గ్లోబల్ స్టేజ్‌పైకి తీసుకువచ్చిన ఘనత బ్రూస్‌కే దక్కుతుంది. అంతర్జాతీయ స్టార్ ఆటగాళ్లపై ఆధారపడకుండా, తమ దేశీయ లీగ్ ఆటగాళ్లను ఎక్కువగా నమ్ముకుని, జట్టులో సమన్వయం, వ్యూహాత్మక నిర్మాణం ద్వారా ఆయన అద్భుతాలు సాధించారు. ఇంతకుముందు 1998, 2002, సొంతగడ్డపై జరిగిన 2010 ప్రపంచకప్‌లలో సౌతాఫ్రికా గ్రూప్ స్టేజ్ దాటలేకపోయింది. కానీ ఈసారి హ్యూగో బ్రూస్ మార్గదర్శకత్వంలో మొదటిసారి గ్రూప్ స్టేజ్ దాటి రౌండ్ ఆఫ్ 32కు చేరుకుని సరికొత్త రికార్డు సృష్టించింది.



## మ్యారేజ్ పుకార్లకు కావ్య మారన్ చెక్!



ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ అయిన కావ్య మారన్ వివాహానికి సంబంధించి ఒక కీలకమైన అప్‌డేట్ బయటపడింది. ఫేమస్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్‌తో ఆమె వివాహంపై ఖాయమైందని తెలుస్తోంది. అయితే, కావ్య వివాహం అకస్మాత్తుగా చర్చనీయాంశంగా ఎలా మారిందనే ప్రశ్న తలెత్తుతోంది. నిజానికి, అనిరుద్ధ మామ, నటుడు వైజీ మహేంద్ర, కావ్య, అనిరుద్ధల వివాహం గురించి మాట్లాడారు. కేపీటీవీకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో, అనిరుద్ధ వివాహం గురించిన ప్రశ్నకు వైజీ మహేంద్ర స్పందిస్తూ, "అనిరుద్ధ చాలా కూల్‌గా ఉండే అబ్బాయి. నాకు తెలిసిన సమాచారం ప్రకారం, కావ్య మారన్‌తో అతని వివాహం దాదాపు ఖరారైంది. అతను చాలా పెద్ద కుటుంబంలోకి అడుగుపెడుతున్నాడు. ఈ సందర్భంగా నేను అతనికి అభినందనలు తెలియజేయాలనుకుంటున్నాను" అని అన్నారు. కావ్య మారన్ గురించి మాట్లాడుతూ, "కావ్య సాధారణ అమ్మాయి కాదు. అంత పెద్ద ఐపీఎల్ జట్టును నిర్వహించగల సామర్థ్యం ఆమెకు ఉంది. ఆమె తన తండ్రి నుంచి వ్యాపార నైపుణ్యాలను వారసత్వంగా పొందింది. వాళ్లిద్దరూ మంచి జోడీ. వాళ్లిద్దరూ కలిసి సంగీత రంగంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలి." ఇప్పుడు, కావ్య, అనిరుధ్‌ల పెళ్లి ఎప్పుడు, ఎక్కడ జరుగుతుందని మీరు ఆలోచిస్తున్నారా? ప్రస్తుతం దీని గురించి ఎటువంటి కచ్చితమైన సమాచారం లేదు. వారిద్దరూ ఎప్పుడు పెళ్లి చేసుకుంటారో చూడటం ఆసక్తికరంగా ఉంటుంది. గతంలో వారిద్దరూ డేటింగ్ చేస్తున్నారని వార్తలు వచ్చాయి. అయితే, ఈ వార్తలపై ఇరుపక్షాల నుంచి ఎలాంటి అప్‌డేట్ లేదు. పెళ్లి గురించి కూడా ఇరుపక్షాలు ఎలాంటి ప్రకటన చేయలేదు. గమనించదగ్గ విషయం ఏమిటంటే, 2025లో, వారిద్దరూ సుమారు ఒక సంవత్సరం నుంచి డేటింగ్ చేస్తున్నారని రెడ్డిట్‌లో ఒక వైరల్ పోస్ట్ పేర్కొంది.

## లైంగిక ఆరోపణలతో కేప్ వెర్డే



2026 ఫిఫా ప్రపంచ కప్‌లో నాకౌట్ దశకు అర్హత సాధించి చరిత్ర సృష్టించిన కేప్ వెర్డే ఇప్పుడు చిక్కుల్లో చిక్కుకుంది. ఆ జట్టు కెప్టెన్ ర్యాన్ మెండిస్‌పై అత్యాచార ఆరోపణలు వచ్చాయి. రౌండ్ 32లో అర్జెంటీనాతో మ్యాచ్?కు సిద్ధమవుతున్న ఈ సమయంలో మెండిస్‌పై ఈ సంచలన ఆరోపణలు కేప్ వెర్డే టీమ్?ను కుదిపేస్తున్నాయి. అయితే లైంగిక వేధింపుల ఆరోపణలను తాము తీవ్రంగా పరిగణిస్తున్నామని, సంబంధింత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని ఫిఫా తెలిపింది. ఈ విషయాన్ని బ్రెజిల్?కు చెందిన 'గ్లోబో' మీడియా సంస్థ నివేదించింది. ఆ నివేదిక ప్రకారం ఈ ఘటన 2026 మార్చిలో జరిగింది. ఈ ఏడాది న్యూజిలాండ్‌లో జరిగిన ఫిఫా సిరీస్ టోర్నమెంట్?లో కేప్ వెర్డే టీమ్ ట్రాన్స్లేటర్?గా పనిచేస్తున్న తనపై మార్చి 27న మెండిస్ అత్యాచారం చేశాడని బ్రెజిలియన్ మహిళ ఫిర్యాదు చేసింది. ఆక్లాండ్‌లోని తన హోటల్ గదిలోకి, ఆ ఆటగాడు బలవంతంగా చొరబడి, తనపై లైంగికంగా దాడి చేశాడని ఆ మహిళ ఆరోపణలు చేసింది. ఈ సంఘటనలో ఆమె తీవ్రంగా గాయపడినట్లు వైద్య పరీక్షలు తేలిందని ఆ నివేదిక పేర్కొంది. ఆమె ఈ విషయాన్ని జట్టులోని ముగ్గురు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, వారు దీనిపై స్పందించలేదని గ్లోబో నివేదిక పేర్కొంది.బ్రెజిల్ మహిళ ఆరోపణలపై ఫిఫా స్పందించింది. ఈ విషయాన్ని సీరియస్?గా పరిగణిస్తున్నామని తెలిపింది. అలాగే ఈ విషయంలో న్యూజిలాండ్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని ఫిఫా తెలిపింది. అయితే ప్రస్తుతం ఈ అంశంపై దర్యాప్తు కొనసాగుతున్నందున ఈ సమయంలో దీనిపై మరింత వ్యాఖ్యానించబోమని ఫిఫా పేర్కొంది. కాగా, ఈ ఫిఫాలో అంచనాలు లేకుండా తొలిసారి ఎంట్రీ ఇచ్చిన కేప్ వెర్డే అందర్నీ ఆశ్చర్యపరుస్తూ నాకౌట్ దశకు అర్హత సాధించింది. గ్రూప్ దశలో ఒక్క మ్యాచ్? కూడా నెగ్గకుండానే ఆ జట్టు రౌండ్ ఆఫ్ 32కు వెళ్లడం విశేషం. గ్రూప్ ఎలో ఉన్న ఈ జట్టు ఇప్పటిదాకా మూడు మ్యాచ్?లు ఆడితే ఒక్క మ్యాచ్?లోనూ ఓటమి లేకుండా అన్నీ డ్రా చేసుకుంది. తొలుత ఛాంపియన్ జట్టు స్పెయిన్?ను అద్భుతంగా నిలువరించింది. ఆ జట్టును ఒక్క గోల్? కొట్టకుండా అడ్డుకొని మ్యాచ్ డ్రా చేసుకుంది. ఆ తర్వాత వరుసగా ఉరుగ్వే, సౌది అరేబియాతో మ్యాచ్?ను కూడా డ్రా చేసుకుంది. దీంతో గ్రూప్ ఎ నుంచి నాకౌట్ దశకు వెళ్లింది. ఇక రౌండ్ ఆఫ్ 32లో కేప్ వెర్డే బలమైన అర్జెంటీనాను ఢీ కొట్టనుంది. ఈ మ్యాచ్ జూలై 4 న ఉదయం 3:30 జరగనుంది. ఈ ప్రపంచ కప్‌లో జరిగిన మూడు గ్రూప్ దశ మ్యాచ్‌లలోనూ మెండిస్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. అతను కేప్ వెర్డే తరపున 100 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 22 గోల్స్ చేశాడు. తన కెరీర్‌లో ఎక్కువ భాగం ఫ్రాన్స్, యూఏఈ తరపున ప్రో లీగ్‌లో ఆడాడు. ప్రస్తుతం తుర్కియే రెండో డివిజన్ క్లబ్ 'ఇగ్దిర్' తరపున ఆడుతున్నాడు.

చురకలు



# వైజాగ్ వేదికగా నేడు లెనిన్ ట్రైలర్ విడుదల




అక్కినేని అఖిల్ అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మాస్ కంబ్యాక్ మూవీ 'లెనిన్' ఇప్పుడు ప్రమోషన్స్‌లో వేగం పెంచింది. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న ఈ మాస్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొనగా, తాజాగా ట్రైలర్ లాంచ్‌కు సంబంధించిన అప్‌డేట్ సినిమాపై మరింత హైప్‌ను పెంచుతోంది. చిత్ర బృందం 'లెనిన్' థియేట్రికల్ ట్రైలర్‌ను జూన్ 30న విశాఖపట్నంలో గ్రాండ్‌గా విడుదల చేయాలని నిర్ణయించింది. సాయంత్రం 4 గంటలకు నగరంలోని ప్రముఖ శరత్ థియేటర్‌లో ఈ ఈవెంట్ జరగనుంది. ట్రైలర్ లాంచ్ కోసం ఇప్పటికే భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. అఖిల్ అభిమానులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోస్టర్‌లో అఖిల్ పూర్తిస్థాయి రస్టిక్ లుక్‌లో సైకిల్ తొక్కుతూ కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది. 'ఏజెంట్' తర్వాత అఖిల్ నుంచి వస్తున్న ఈ సినిమా ఆయన కెరీర్‌కు కీలకంగా మారనుంది. చాలా కాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న అఖిల్, ఈసారి పూర్తిస్థాయి మాస్ యాక్షన్ కథను ఎంచుకోవడం విశేషం. ఈ చిత్రంలో అఖిల్ సరసన యువ నటి భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. వీరిద్దరి కెమిస్ట్రీ కూడా సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, మనం ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంగీత దర్శకుడు ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలపై మంచి అంచనాలు నెలకొన్నాయి. జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న 'లెనిన్' చిత్రం అఖిల్ కెరీర్‌లో అత్యంత కీలకమైన సినిమాగా భావిస్తున్నారు.



# దిల్‌రుబా భామ రుక్సార్ ధిల్లాన్ అందాల సందడి

'దిల్‌రుబా' చిత్రంలో కిరణ్ అబ్బవరం సరసన నటించిన రుక్సార్ ధిల్లాన్ తన అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. 2015లో విడుదలైన కన్నడ చిత్రం 'కట్టె' ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన రుక్సార్, 2016లో 'రన్ ఆంటోని' సినిమాతో గుర్తింపు పొందారు. అనంతరం 'ఆకతాయి' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టారు. తెలుగులో 'కృష్ణార్జున యుద్ధం', 'ఏబీసీడీ: అమెరికన్ బోర్న్ కన్ఫ్యూజ్డ్ దేశీ', 'అశోక వనంలో అర్జున కళ్యాణం' చిత్రాలతో మంచి గుర్తింపు సంపాదించారు. అలాగే హిందీలో 'భాంగ్రా పా లే', 'జాదుగర్' చిత్రాల్లోనూ నటించారు. ఇటీవల 'నా సామిరంగా' చిత్రంలో కీలక పాత్రలో కనిపించిన రుక్సార్, కిరణ్ అబ్బవరం సరసన 'దిల్‌రుబా' సినిమాలోనూ ప్రేక్షకులను అలరించారు. వాణిజ్య చిత్రాలతో పాటు కథకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ప్రస్తుతం తెలుగు, పాన్-ఇండియా స్థాయిలో రూపొందుతున్న పలు చిత్రాలతో బిజీగా ఉన్న రుక్సార్ ధిల్లాన్, దక్షిణాది చిత్రసీమలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.

# పారిపోదామనుకున్నా..

## కీర్తి సురేష్ ఆసక్తికర వ్యాఖ్యలు



ప్రముఖ నటి కీర్తి సురేష్ తన ప్రేమ, వివాహం గురించి గతంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ప్రేమించిన వ్యక్తితో పెళ్లికి ఇంట్లో పెద్దలు ఒప్పుకోకపోతే ఇంటి నుంచి వెళ్లి వివాహం చేసుకోవాలని కూడా ఒక దశలో అనుకున్నానని ఆమె వెల్లడించారు. తెలుగు, తమిళ చిత్రాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కీర్తి సురేష్, హీరో రామ్ పోతినేని నటించిన 'నేను శైలజ' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అనంతరం 'మహానటి' చిత్రంతో విశేష గుర్తింపు పొందిన ఆమె, పలువురు అగ్ర హీరోల సరసన నటించారు. దీర్ఘకాలంగా ప్రేమలో ఉన్న ఆంటోనీ తట్టిల్‌ను కీర్తి సురేష్ 2024లో హిందూ, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం వివాహం చేసుకున్నారు. దాదాపు 15 సంవత్సరాల ప్రేమ తర్వాత వీరిద్దరూ ఒక్కటయ్యారు. ఒక ఇంటర్వ్యూలో కీర్తి మాట్లాడుతూ, తమ ప్రేమ విషయం ఇంట్లో చెబితే పెళ్లికి అంగీకరించరేమోనని మొదట భయపడ్డామని చెప్పారు. అవసరమైతే ఇంటి నుంచి వెళ్లి పెళ్లి చేసుకోవాలని కూడా అనుకున్నామని, అయితే కుటుంబ సభ్యులు తమ ప్రేమను అంగీకరించి ఘనంగా వివాహం జరిపించారని తెలిపారు. తమ పెళ్లి ఇరు కుటుంబాల సమక్షంలో ఎంతో వైభవంగా జరుగుతుందని ఊహించలేదని, అందుకే వివాహ సమయంలో తాము ఇద్దరం భావోద్వేగానికి గురయ్యామని కీర్తి సురేష్ పేర్కొన్నారు. వివాహం అనంతరం కూడా కీర్తి సురేష్ సినీ రంగంలో చురుకుగా కొనసాగుతూ వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు.

# రెండు సినిమాలే అయినా ఎన్నో యుద్ధాలు చేశాం

## రాహుల్ సాంకృత్యాయన్‌కు విజయ్ బర్త్‌డే విషెస్




విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'రణబాలి'. నేడు రాహుల్ పుట్టినరోజు సందర్భంగా విజయ్ ఆయనకు విషెస్ చెప్పారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'టాక్సీవాలా'ను గుర్తుచేసుకున్నారు. టాక్సీవాలా' వచ్చి తొమ్మిదేళ్లు దాటింది. ఈ తొమ్మిదేళ్లలో మనమిద్దరం ఎన్నో విషయాల్లో ఎదిగాం. అర్థవంతమైన కథలు రాయాలి.. ప్రేక్షకులను అలరించాలనే నీ పట్టుదలలో.. నీ పాత్రకు ప్రాణం పోయాలనే నా తపనలో ఎలాంటి మార్పు రాలేదు. మనం కలిసి చేసింది కేవలం రెండు సినిమాలే.. అయినా వాటి కోసం ఎన్నో యుద్ధాలు చేశాం. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాం. అన్ని అడ్డంకుల మధ్య విడుదలైన మన మొదటి సినిమా. ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. ఇప్పుడు రెండో చిత్రానికి కూడా నేను నీకు తోడుగా ఉన్నాను. మనం మళ్లీ ఆ ప్రేక్షకాదరణను పునరావృతం చేద్దాం. విజయాన్ని అందుకుందాం అని విజయ్ దేవరకొండ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. రాహుల్ సినిమాలో భాగమవడం తనకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నట్లు విజయ్ తెలిపారు. ఆయన పనితనాన్ని ప్రపంచం చూడబోతున్నందుకు ఎంతో ఉత్సాహంగా ఉందని పేర్కొన్నారు. విజయ్ దేవరకొండకు జోడీగా రష్మిక నటిస్తోన్న ఈ సినిమా సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. 1854 నుంచి 1878 మధ్యకాలంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా 'రణబాలి' చిత్రం రూపొందుతోంది.

# ఇరుముడి కట్టు లిరికల్ వీడియో విడుదల




మాస్ మహారాజా రవితేజ హీరోగా దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ 'ఇరుముడి' సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన తొలి పాట 'ఇరుముడి కట్టు' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అయ్యప్ప స్వామి భక్తి నేపథ్యంలో రూపొందిన ఈ గీతం భక్తి భావాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసేలా ఉండటంతో సోషల్ మీడియాలో మంచి స్పందనను సొంతం చేసుకుంది. సోమవారం చిత్ర బృందం విడుదల చేసిన ఈ లిరికల్ వీడియోలో రవితేజ భక్తి పారవశ్యంలో మునిగిపోయిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ ప్రారంభమయ్యే ఈ పాట, చివరి వరకు భక్తి రసాన్ని కొనసాగిస్తూ శ్రోతలను అలరిస్తోంది. పాటలో అయ్యప్ప మాలధారణలో కనిపించిన రవితేజ, భక్తి భావాలతో నిండిన స్టెప్పులు వేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆయన లుక్, ఎక్స్‌ప్రెషన్స్, పాట చిత్రీకరణకు సంబంధించిన విజువల్స్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే సినిమాలో రెండు అయ్యప్ప స్వామి భక్తి గీతాలు ఉంటాయని ఆయన వెల్లడించారు. అందులో భాగంగా విడుదలైన తొలి పాటకు సంగీతం, ఆర్కెస్ట్రేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ గీతాన్ని గాయకుడు అనంతు తన స్వరంతో అద్భుతంగా ఆలపించారు. పాట సాహిత్యాన్ని దర్శకుడు శివ నిర్వాణ, రచయిత కళ్యాణ్ చక్రవర్తితో కలిసి రాయడం విశేషం. 'ఇరుముడి' సినిమాలో భక్తి, భావోద్వేగాలు, థ్రిల్ అంశాలు సమపాళ్లలో ఉండనున్నాయని సమాచారం. ఫస్ట్ సాంగ్‌కు వస్తోన్న స్పందనను చూస్తుంటే సినిమా సంగీతం కూడా ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మూవీ అరుదైన రికార్డు

టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన కెరీర్‌లో అరుదైన డిజిటల్ మైలురాయిని అందుకున్నారు. పలువురు స్టార్ హీరోలకు కూడా సాధ్యం కాని ఘనతను ఆయన సొంతం చేసుకుని సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కించిన 2017 యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జయ జానకి నాయక' హిందీ డబ్బింగ్ వెర్షన్ యూట్యూబ్‌లో ఏకంగా 1 బిలియన్ (100 కోట్ల) వ్యూస్ సాధించి సంచలనం సృష్టించింది. 'ఖుంఖార్' పేరుతో ప్రముఖ యూట్యూబ్ ఛానెల్‌లో విడుదలైన ఈ చిత్రం సంవత్సరాలు గడిచినా ప్రేక్షకాదరణను ఏమాత్రం కోల్పోలేదు. నెమ్మదిగా వ్యూస్ పెంచుకుంటూ వచ్చిన ఈ సినిమా ఇప్పుడు వంద కోట్ల వ్యూస్ మార్క్‌ను దాటడం విశేషం. దీంతో భారతీయ సినీ చరిత్రలో ఈ అరుదైన ఘనత సాధించిన చిత్రాల జాబితాలో చోటు దక్కించుకుంది. ఈ రికార్డుతో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పేరు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. యూట్యూబ్‌లో ఒక ఫుల్ లెంగ్త్ డబ్బింగ్ సినిమాకు 1 బిలియన్ వ్యూస్ సాధించిన తొలి తెలుగు హీరోగా ఆయన నిలిచారు. టాలీవుడ్‌కు చెందిన అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలు హిందీలో డబ్ అయ్యి యూట్యూబ్‌లో విడుదలైనప్పటికీ, ఒక్క సినిమాతో ఈ స్థాయి వ్యూస్‌ను అందుకోవడం ప్రత్యేకమైన విజయంగా చెప్పవచ్చు. ఈ సినిమాలో రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్‌గా నటించగా, జగపతిబాబు, శరత్ కుమార్ కీలక పాత్రలు పోషించారు. థియేటర్లలో డీసెంట్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం, డిజిటల్ పాట్ల్‌ఫామ్‌లలో మాత్రం అసాధారణ ఆదరణను దక్కించుకుంది.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com